# కా.రా. మాస్టారి యజ్ఞం-కథ

**(సంక్షిప్తంగా)**

సుందరపాలెం గ్రామం-శ్రీకాకుళానికి పదిహేను మైళ్ల దూరం. ఆ గ్రామంలో ఈశాన్యానికీ, తూర్పుకీ, దక్షిణానికీ మెరకభూములు- మిగిలినవేపు పల్లపు భూములు. ఆ గ్రామం అంతా కలిపి-నాలుగువందల ఇళ్లు-వొక చిన్నదేవాలయాన్ని చుట్టి వుంటాయి. మిగిలినవి కొత్తగా వచ్చిన హైస్కూలు చుట్టూ లేచిన ఇళ్లు. ఆ కోస్తాలో సుందరపాలెం పలువురు అనాధల నడుమ పచ్చగా బతికే సనాధలా వుంటుంది.

అప్పల్రాముడు-ఆ వూరి పంచాయితీ హరిజన మెంబరు. మాలలకు కులపెద్ద. వూరిజనంలో మూడొంతుల ముప్పాతికమందికి-అప్పల్రాముడు - మాటకు నిలబడేవాడు, మర్యాదగా బతికేవాడనే సదభిప్రాయం వుంది.

గోపన్న - ఆ వూరిలో వొకానొక షావుకారు. సాత్వికుడు, ఒకప్పుడు ఘనంగా బతికి, యిపుడు చితికిపోయినవాడు.

గోపన్న షావుకారికి-రెండు వేల రూపాయలు బాకీపడ్డాడు అప్పల్రాముడు. వడ్డీతోసహా రెండు వేల అయిదు వందలు యివ్వతేలింది. గోపన్నా, అప్పల్రాముడూ - తుమ్మకొయ్యల్లా స్నేహంగా వుండేవారట. పేదరికం వాళ్లను రచ్చకెక్కించింది.

శ్రీరాములు నాయుడు - సుందరపాలెం గ్రామ సర్పంచ్. పట్నంలో లా చదివివొచ్చేడు. గ్రామాన్ని అభివృద్ధిపరచటమే అతని జీవిత కాంక్ష. అలాగే గ్రామాన్ని అభివృద్ధి పరిచేడు. ప్రజలకు జ్ఞానంకోసం విద్యాలయాన్నీ, ఊరికి రహదారికోసం రోడ్లనీ, వెలుగుకోసం విద్యుత్తునీ - యిలా, మిల్లుల్నీ, ఆఫీసుల్నీ, సొసైటీలనీ.... వొకదాని తర్వాత వొకటిగా ఆ ఊరికి వొచ్చేట్లు యజ్ఞం చేసాడు. ప్రజలనించి, భూదానం, శ్రమదానం, ధనదానం సేకరించేడు. ఊరు-కొత్తకొత్త ఆఫీసుల్తో, బిల్డింగుల్తో, రోడ్లతో కళకళలాడసాగింది. ఊరిని అభివృద్ధి పరిచిన శ్రీరాములు నాయుడు-ఆ ఊరి ప్రజలకోసం 'న్యాయ మండపం' నిర్మించాడు. ఈ మండపం వున్నంతకాలం న్యాయంకోసం-యీ వూరి ప్రజలు, వూరు దాటి బయటకు పోరాదనీ, యేనాడైనా, యెవరేనా అలా న్యాయంకోసం బయటికి

పోయిననాడు–యీ మండపాన్ని–మనం, మన చేతుల్తోనే కూల్చివేద్దామనీ– ఊరి ప్రజలందరితో ప్రతిజ్ఞ చేయించి, సమిష్టిని నిలబెట్టేడు.

గోపన్న షావుకారి – తగువుని శ్రీరాములు నాయుడి వద్ద పెట్టాడు. మూడేళ్ల గడువు కావాలన్నాడు అప్పల్రాంవుడు. శ్రీరాములు నాయుడు యిచ్చిన గడువు తీరిపోయి, మూడు నెలలైంది. శ్రీరాములు నాయుడు యేదో స్వంతపనిలో వుండి, గోపన్నకు దొరకడు. తగు పెద్దల్లో వొకరైన లక్ష్మనాయుడ్ని కలిసి, గోడు విన్నవించుకుంటాడు.

లక్ష్మనాయుడూ, గ్రామపెద్దల్లో కొందరూ, మునసబూ, కర్నాలూ కబురు చేస్తారు. పరపతి చెడి, బతుకుల్లేకుండా అయిపోవద్దంటారు. భూమి అమ్మేసి అప్పుతీర్చి, పరపతి నిలుపుకోమంటారు. చేయందుకొచ్చిన పిల్లలున్నారు. నలుగురి బుగతల వద్ద కంబరికం చేసినా–కాలం గడిచిపోతుంది. లేదా, నూతుల చెరువు ఎగువన పోతినాయుడు వరకట్టిన బంజరుకి యెగువన అయిదెకరాల బంజరుంది, దాన్ని వరగట్టి, సాగుజేసి బతకొచ్చు అని చెప్పి చూస్తారు పెద్దలు. పెద్దలు చూపిన యే దోవా–తమకు బతుకుదోవ కాబోదని బోధపడిన అప్పల్రాంవుడూ, అతని కుటుంబంవూ... పెద్దలతో–ఆ బంజరేదో గోపన్నకే యిప్పించితే, దాని మీద తాము కూలిజేసి అప్పుతీరుస్తామంటారు.

ఇది తేలే తగవుగాదని–శ్రీరాములు నాయుడే తీర్చాలని వాయిదా వేస్తారు పెద్దలు, మూడో నాటికి– న్యాయమండపం మీద శ్రీరాములు నాయుడు కొలువుదీరి, తగవు పంచాయితీ జరుగుతుంది.

మూడేళ్ల కిందటి మాట ప్రకారం–అప్పు తీర్చాలంటాడు శ్రీరాములు నాయుడు. న్యాయం అంటాడు. పంచాయితీ పెద్దలూ ఔనంటారు.

అప్పుడు అప్పల్రాంవుడు–

"అది అప్పో, అప్పు కాదో, అయితే యేనాటి అప్పో, ఎలా దేలిన అప్పో–పెద్దలు ఆలోసించి చెప్పాల...." అనంటాడు.

పెద్దలు తలావొక మాటలంటారు. శ్రీరాములునాయుడు.

"....యిది అప్పే, అప్పే... అప్పే..." అని ఉద్రేకంతో పలికి–

"...నేనైనా, యింకొకరైన దీనిని అప్పుకాదని యెలా అంటారో – అనగలరని యెలా ఆశిస్తున్నారో – బోధపట్టంలేదు" అంటాడు.

దాంతో అప్పల్రాంవుడి ఆశలు చెల్లిపోయేయి. ఎన్నాళ్లనించో, తన భూంవిని కొనుక్కోడానికి, మొలగుడ్డలో బయానా డబ్బులు పెట్టుకుతిరుగాడే ముసలయ్యకు చేయి చాపి–

"...నా భూంవికి ఏంవిస్తావో నీ దయ. ఇప్పించు..." అంటాడు. కరణం పురోణిపత్రం రాస్తాడు.

అప్పల్రాంవుడు, ఆ పురోణిపత్రం తీసుకొని, చేత్తోపట్టుకొని పెద్దల కెదురుగా నిల్చొని.

"...యీ తగువులో నిజానిజాలెట్టివో, యిది నాయింవైన, అప్పుకాదని, నానెందుకన్నానో; యిది నరుడు తెచ్చిన చిక్కో, నారాయణుడు తెచ్చిన చిక్కో... ఆ కథంతా, చెప్పి, అప్పుడు దీని మీద యేలిముద్ర ఎడతాను... యినండి..." అంటూ ఆరంభించి, యాభయ్యేళ్ల గ్రామ ఆర్థిక సాంఘిక మార్పుల్ని వివరించుకొస్తాడు అప్పల్రాంవుడు.

ఆహారపంటల్తో, సరకు మార్పిడి వాణిజ్యాల్తో, బతికే గ్రామాల్లోకి- వ్యాపార పంటలూ, రూపాయల్లో వాణిజ్య వ్యవహారాలూ రావటం, కొత్త వ్యాపారస్తులూ, కొత్త లావాదేవీలు ప్రవేశించటం ఈ లోగా శ్రీరాములు నాయుడు అభ్యుదయ యజ్ఞం-ఫలితంగా, రోడ్లూ, కరెంటూ, సొసైటీలూ, కార్యాలయాలూ, పెను కదలిక గ్రామీణ జీవితాల్లో సంభవించటం!

దశాబ్దాలు గడిచేసరికి-చిదిగిన రైతులూ, పని దొరకని కూలీలూ, అప్పుల్లో మునిగిన చిన్నరైతులూ....' తొలినాటి తనువేసిన వేరుశనగ పంటను-గోపన్న షావుకారి వ్యాపారానికి పెట్టుబడిగా...అరువిచ్చిన అప్పల్రాంవుడు...కొన్నాళ్లకి కిందకి దిగజారటం, గోపన్న యెదగటం యెలా జరిగిందో వివరిస్తాడు.

ఈ క్రమమంతటిలో-రైతులూ, పేదలూ బలిపశువులెలా అయ్యారో; యజ్ఞఫలా లెవరికందాయో- చూడండంటాడు. నిష్ఠురజీవన సత్యాల్ని చూపి-

"...అయ్యలారా, భూమి అమ్మి అప్పుతీర్చి, మమ్మల్ని కంబార్లని చేస్తే-నిన్ను నరికి పోగుపెట్టి, నన్ను నేను నరుక్కు చస్తాను అనన్నాడు మా సీతారాంవుడు..." అని చెప్తాడు ఆఖరిగా. ఆశగా చూస్తాడు శ్రీరాములు నాయుడి వేపు క్షణకాలం. ఆశ అడియాసయ్యింది. అంతే, పురోణి కాయితమ్మీద, వేలిముద్ర వేస్తాడు అప్పల్రాముడు. తర్వాత, తన కొడుకుల్నీ, మనవల్నీ వొకొక్కొర్నీ పిలిచి వేలిముద్ర వెయ్యమంటాడు.

అదిగో అప్పుడు, సీతారాంవుడు, పరుగెత్తుకుంటూ పేటలోకి వెళ్తాడు. అట్నించి భుజమ్మీద మూటతో వొస్తాడు. మండపమ్మీద మూట విప్పుతాడు "టక్", "దబ్" మని ఒక తలా, చిన్నారి దేహం నేలమీద రాలాయి. చిన్నారి లేత దేహాన్ని చూపుతూ, సీతారాంవుడు-

"...ఒరయ్యా, నువ్వు నీ బిడ్డలికేటిచేస్తన్నావో నీకు తెల్దు. నీగ్గానీ, జనం కంటిగ్గానీ కన్పించని దాన్ని-అందరికీ కనబడినట్లగ నాను చేసాను" అనంటాడు.

భూంవి పోగొట్టుకొని, బానిస బతుకుని కొడుక్కి యివ్వలేక, కొడుకుని చంపుకున్నానంటాడు సీతారాంవుడు.

జనం హాహాకారాలు. శ్రీరాంవులు నాయుడు నిశ్చేష్టుడైనాడు. అప్పల్రాంవుడు శిరస్సు వంచేసి నిల్చున్నాడు. సీతారాముడు...నిల్చున్న వాడల్లా చతికిలబడిపోయేడు ఆ న్యాయమండపం ముందు... ...★

# యజ్ఞం...తర్వాత

"...మీరెవ్వరూ తొందరపడకండి! నా మాట వినండి. శాంతం వహించండి!" కలవరింతతో, శ్రీరాములు నాయుడికి హఠాత్తుగా మెలకువ వొచ్చింది. శరీరమంతా గజగజా వజవజా వణుకు.

కిటికీలోంచి పడమటిగాలి చల్లగా తగుల్తోంది. ఉగాది యింకో పక్షం రోజులుంది. శివరాత్రి అమావాస్యకు పడతాయనుకున్న చినుకులు– నిన్న రాత్రిపూట... మురిపించి, మురిపించి జారీ అయిన విదేశీ ఋణంలా – కొంచెం రాలేయి! అవెందుకు పనికొస్తాయి? ఏవి? చినుకులా, విదేశీ ఋణాలా...?

'ఇంతకీ – తనకెందుకు మెలకువ వొచ్చింది? పడమటి చలిగాలికి తోడు పంకాగాలి వల్లనా? కాదు. ఏదో కల...! యేవేవో కలవరించేను...! శ్రీరాములు నాయుడు తనలోతనే తర్కించుకొని, మంచమ్మీంచి లేచి పంకా స్పీడ్ తగ్గించేడు. పడమటి వేపు కిటికీ రెక్కలు గూడా మూస్తుండగా–ఆకాశంలో మెరుపులు! కళ్లు జిగేల్మన్నాయి. ఎందుకో ఆకాశాన్ని చూడాలన్పించింది. కిటికీ మూసేసి, గది బయటికొచ్చేడు. ఆ గది, ఆ భవంతికి తూర్పు మూల కొసన వుంటుంది. ఆ గది నుండి బయటికొస్తే – దక్షిణం వేపు రోడ్డూ, దాన్ని ఆనించిన యిళ్ల వాసలూ (వరుసలు) కన్పిస్తాయి.

శ్రీరాములు నాయుడు గది బయటికొచ్చి – ఆకాశం వేపు చూసేడు. నల్లగా, కారు నల్లగా – దుఃఖపు గోదాములా వుంది ఆకాశం! అక్కణ్ణుంచి కాదుగదా –మానవ లోకానికి... యింత దుఃఖం వర్షిస్తున్నది? 'ఫెణేళ్ ఫెణేల్ ఫెణేల్' శబ్దంతో దుఃఖపు గోదాములో ఉరుములు! అసంకల్పితంగా 'అర్జునా' ఫల్గుణా, పార్థా, కిరీటీ...' అని స్మరించుకున్నాడు. విసురుగా గాలి వీచింది. విద్యుత్తు ఆగిపోయింది. వీధీ, ఊరూ, ఆ భవంతీ – చీకటిలో మునిగిపోయాయి. కాసేపు అలా నిల్చోబోతే – ఆకాశం దుఃఖపు వాసన వేస్తోంది. నిల్చోలేక, అంచనా మీద అడుగులు వేసుకుంటూ, గదిలోకొచ్చేసి మంచమ్మీద చేరబడ్డాడు. కళ్లు మూసుకుని, తనగదినీ, మంచాన్నీ, తన ఆస్తిత్వాన్నీ దర్శించబోతే – ఊరి వెలుపలి తోటలోని మామిడిచెట్టుకు వేలాడే విరిగిన కొమ్మ కన్పించసాగింది. ఆ తర్వాత, కాస్సేపటికి కలగుర్తు కొచ్చింది. కల మళ్లీ కదలాడింది....

"అదిగో వొస్తుండు..."

"చేతిలేం వుంది...?"

మండపం దగ్గర, పంచాయతీకి చేరిన జనం, అటువేపున చూస్తూ, భయాందోళనల్తో... తలా వొకరకంగా మాట్లాడుతున్నారు. ఇంకోవేపు అప్పల్రాంవుడు తన వేపు వేలు చూపిస్తూ–

"నీ దెబ్బన్నది తగిలిన చోట కనబడదు. నువ్వేం జేసినా – చాప కింద నీరులాగా సల్లగా ముంచుతావు..." అన్న మాటలు – మళ్లీ, మళ్లీ చెవిలో విన్పిస్తున్నాయి....

శ్రీరాములునాయుడు దీర్ఘంగా నిట్టూర్చేడు. డెబ్బయి అయిదేళ్ల తన వృద్ధదేహాన్ని – అపాదమస్తకం వోసారి చేతుల్తో తడుముకున్నాడు. మనిషికి మాత్రమే సాధ్యమయ్యే అపూర్వ స్పర్శను కోరుతోంది హృదయం...!

క్షమించమని కోరేందుకు – అప్పల్రాంవుడీ లోకంలో లేడు... మూల్గింది గుండె! దుఃఖం ముంచుకొచ్చి, లేచి మంచమ్మీద కూర్చున్నాడు. ద్వారం వేపు నుంచి – చీకటిలో యెవరో అస్పష్టంగా! భుజమ్మీద యేదో వుంది! ఏంవిటది...?

ఎవరది...?

సీతారాంవుడా...?

భుజమ్మీద... గోనెమూటకాదు. తుపాకీ! వీపు మీద కిట్ బ్యాగ్!

"ఎవరది? ఎవరు, సీతారాంవుడూ?" భయంతో కేకవేసాడు శ్రీరాములు నాయుడు. కానీ, ఆ కేక... అతని గొంతు పూరాగా రాలేదు. సన్నగా వొచ్చింది.

"సీతారాంవుణ్ని గాదు. చినప్పలరాంవుణ్ని. అప్పల్రాంవుడి పెద్దకొడుకు కొడుకుని... చీకట్లోని వ్యక్తి జవాబు.

కలా.. వాస్తవమా...?

శ్రీరాములు నాయుడు – కళ్లు నులుపుకొని చూసేడు.

"నేను రాకముందు కల వొచ్చి వుంటుంది. గాని, నేను రావడం వాస్తవం. ఎప్పటికీ – మీ ఆధిపత్యమే సాగాలా? యజ్ఞ ఫలాలు – యెప్పటికీ మీ వర్గానికే చెందాలా? మీ యజ్ఞానికి ప్రజలు సమిధలు గావలసిందేనా... ఎల్లాకాలమూ?" ఆ వ్యక్తి, యేమేమో మాట్లాడసాగేడు.

శ్రీరాములు నాయుడు – బిక్కుబిక్కుమని చీకటిని చూడసాగేడు. మళ్లీ అతనికొక్కసారిగా – అలనాటి పంచాయితీ, గోపన్న సావుకారి అప్పుకింద – అప్పల్రావుడి భూమి అమ్మకం, సీతారాంవుడి భుజమ్మీద గోనె మూటలోంచి... నెత్తురోడే మొండెం, తెగిన శిరస్సూ, ప్రశ్నించే నేత్రాలూ... అన్నీ అప్పటివి... ఆందోళనతో చెల్లా చెదురయిన సభ....

"యేని గోసీ, యేని ముద్రేసుకుండ్రో – అన్నోరి నా పేద రైతా...."

"సీతారాంవుడూ – యెంత ఘోరం చేసుకున్నావయ్యా?"

అప్పల్రాంవుడు మనవడి ఖండిత శిరస్సుని ఒడిలో పెట్టుకొని, గుండెలు బాదుకు యేడుస్తున్నాడు. ఆ కుటుంబపు ఆడవాళ్లు నెత్తీనోరూ కొట్టుకుంటున్నారు. చమురు మొత్తమంతా యింకి, కాలిపోయిన ఆఖరి వొత్తివేపు చూసే ప్రమిదలా – శూన్యపు చూపుల్తో నిల్చున్న సీతారాంవుడు. అప్పటిదాకా, పెద్దలకు ముందరగా నిల్చున్న లక్ష్మునాయుడు – అణచుకున్న ఆగ్రహంతో, వెనకకొచ్చేడు : 'అచ్చు రిపోర్టు రాయాల. ఖూనీ! ఖూనీ గదా? యేంవంటారన్నట్టు చూసేడతన్ని, మున్సబు.

"ఓరి నాయిన, వోర్నాయిన! ఇదేటిది? హన్నన్నా... వొద్దొద్దు. నీ భూమీ నాకొద్దు. ఈ గొడవా నాకొద్దు. అప్పల్రాంవుడో – యిదా, యిగ్గిదిగో, పురోణీకాయితం చింపేస్తున్నాను..." అని, పురోణీ కాగితాన్ని పరా, పరా చింపి పారేసి; అక్కడ్నించి గబగబా తన యింటివేపు అడుగులేసాడు ముసలయ్య.

ముసలయ్య వెనకనే కొంతమంది జనం అక్కడ్నించి కదిలేరు. వెళ్తున్నవాళ్లు, వెనక్కి పంచాయితీ వేపో, గోపన్న సావుకారి వేపో చూసుకుంటూ–

"అయితిపుడు తీర్పు మాటేటి...?"

"గోపన్న సావుకారికింతే సంగతులా...?"

"అలగెందుకవుతాది? తీర్పయిపోయింది కదేటి? పెద్దలొప్పుకుంతారేటి? శీరాంవుల్నాయుడిబాబు సంగతేమోగాని – లచ్చుం నాయుడొప్పడు. మాట పంతం మనిషి! సావుకారి సొమ్ము, పోదు, పోదు...!" యిలా, తర్కించుకుంటూ వెళ్తున్నారు.

వారి మాటలు విన్నందునో, జరిగిన పంచాయితీ అంతా చూసి కడుపు మండి నందునోగానీ – అప్పల్రాంవుడి వీధి మనిషి వొకాయన, యేడ్పు గొంతుతో–

"సెబాసో, సెబాస్! నేయిం...యిది గిలగ నిలబడిపోయింది. సెబాస్! పేనాలు పోయినాయని యిసారించకండి. పెద్దరికం నిలబడిందో, నేదో సూస్కోండి! ఇందుకే గావాల – వల్లకాటికి దగ్గరగా మా కొంపలుంతాయి. మండపాలకి దగ్గరగా... తంపరి యిళ్ల వాసలుంతాయి. ఏలుకొండి బావులూ – వల్లకాదునీ యేలుకోండి"... అని ఆక్రోశం వెళ్లగక్కి, వెళ్లిపోయేడు.

అతడి మాటలకి, అన్నమయ్య – భుజమ్మీది తువ్వాలుని దులిపేడు ముందు, తర్వాత, సర్రున లేచేడు. కళ్లెర్ర జేసి, కలియబడబోయేడు. ఎవరో ఆపేరు.

"యిదిగిలాగే వుంటాది. నరుడి నాలుక –నాలుగు రకాలుగా పలుకుతాది. వేగం తేల్చండి. రిపోర్టు రాయడమా, మాఫీ చెయ్యడమా – పెద్దలు వేగిరం తేల్చండి..." శ్రీరాములునాయుడి వేపు చూస్తూ – కర్నంగారు పలికేరు.

శ్రీరాములు నాయుడికి యివేవీ విన్పించటంలేదు. ఎక్కడో వున్నాడు... 'వీధులు సరిగ్గాలేని, వీధిదీపాల్లేని, విద్యాగంధంలేని – మిద్దెల, పెంకుటిళ్ళ సమూహం – రాజుల, జమీందార్ల, ఆంగ్లేయుల యేలుబడిలో చిదిగిన, నలిగిన బతుకులు...! స్వరాజ్యం, స్వపరిపాలన, విద్యాలయాల్లో తను చదివిన ప్రపంచం, గ్రామల్ని అభివృద్ధి పరిచేందుకు... తను కలలుగనటం. ఏవేవో ప్రణాళికలు, ప్రయత్నాలు, అందర్నీ ముందుకు నడపాల! గ్రామాన్ని కదపాల... అంతే! అదే సర్వస్వం... తనని నిద్రబోనీయటంలేదు.

వెలుగూ, విద్యా, రోడ్లూ, పరపతి సంఘాలూ, పంచాయితీ, మండపమూ, పథకాలూ, ప్రణాళికలూ, ప్రయత్నాలూ – సాయంత్రపు వెలుగు గుంకె వేళ, 'సింతమ్మతల్లి గట్టు' దగ్గర – అప్పల్రాంవుడికి – యింకా తను యేదో బోధపరుస్తున్నట్టే.. అక్కడే వున్నాడు....

"కూల్చిన సీతారాంవుడి స్మారక స్థూపాన్ని పునర్నిర్మించాలి. మీరే నిర్మిస్తారో, ప్రభుత్వం చేత నిర్మాణం చేయిస్తారో గానీ – మాకు స్థూపం కావాలి! ఈ లేఖ, మీరుజిల్లా కలెక్టర్‌కి అందజెయ్యండి...!" చిన్నప్పల్రాంవుడు, కిట్‌బ్యాగ్‌లోంచి లేఖతీసి, శ్రీరాములు నాయుడికిచ్చేడు.

శ్రీరాములు నాయుడా లేఖను – పేకెట్ బాంబ్‌లా భయం, భయంగా అందుకున్నాడు. మంచమ్మీంచి గభాల్న కిందకుదిగి, తడారిన గొంతును సవరించుకొని–

"నాకు స్థూపం నిర్మించే శక్తీ లేదు. నా మాట ప్రభుత్వం వింటుందనే నమ్మకమూ లేదు. నా మాటకు అంత విలువాలేదు..." గబ, గబా ఆ రెండు ముక్కలూ చెప్పేసి తలదించుకున్నాడు నాయుడు.

బయట సన్నగా వాన! ఆకాశంలో యెక్కడో ఉరుములూ, మెరుపులూ... ఆశ్చర్యంగా చూసేడు చిన్నప్పల్రావుడు నాయుడి వేపు! క్షణకాలపు ఆకాశపు మెరుపుల్లో ఆకాశంలో... ఆ చినుకుల్లో మొన్ననెప్పుడో తప్పిపోయిన పక్షిగామోసు గూటి కోసమో, సాటి పక్షులకోసమో, వెదుకుతూ కలవరిస్తోంది..!

"నన్ను మన్నించు అప్పల్రాంవుడు...!"

చీకటి ఆకాశంలో పక్షి కలవరింత!

గోనె సంచిలోంచి రాలిపడిన ఖండిత దేహమే గుర్తొచ్చి – అలనాడు అప్పల్రాంవుడికి క్షమాపణలు చెప్తున్నట్లు, చెప్పేడు శ్రీరాములు నాయుడు. మళ్లీ నాయుడు గతంలోకి, చెదిరిన కలలోకి, పంచాయితీ మండపం దగ్గరకు వెళ్ళేడు...

"సరి, సరి! ఇకీ రోజుతో మన ఊరి కట్టు చెదిరిపోయింది. ఊరిగుట్టు ఊరవతలకి వెళ్లిపోయింది. ఇంకేం దాచగటం? ఈ ఖూనీ మాఫీ చెయ్యగలమా? ఇరుగూరు, పొరుగూరు... వీళ్లూ, వాళ్లూ అందరూ చూసేరు. ఒకరిద్దరి నోళ్లు ముయ్యగలం. అందరి

కళ్లు కప్పలేం. సీతారాం్వుడి మీద ఖూనీకేసు – అచ్చు రిపోర్టు రాయికతప్పదు...!" మునసబు, పంచాయితీ పెద్దలందరి వేపూ చూస్తూ చెప్పేడు.

"నీ పని నువ్వు కానియ్యవయ్యా..." ఆజ్ఞలాగా పలికేడు లక్ష్మునాయుడు. అలా, ఆజ్ఞాపిస్తున్నపుడు, ఆయన – శ్రీరాములు నాయుడి వేపు చూడనేలేదు. శ్రీరాములు నాయుడు చెయ్యాల్సిన పెద్దరికం – యికనించీ తనే చెయ్యాలని, ఆ క్షణాన ఆ స్థితిలో ఆయన నిర్ణయించుకున్నాడు.

"పోలీస్ స్టేషన్‌కి వర్తమానం పంపాలి" కర్నంగారు.

తలయారీ వేపు చూసేడు లక్ష్మునాయుడు. తలయారీ పోలీస్‌స్టేషన్‌కి పరుగెత్తాడు.

మండపం దగ్గర, పంచాయితీ కోసం చేరిన పొరుగూళ్ల ప్రజలు – యీ హత్యా వార్త ప్రచారానికి, చెదిరిపోయిన ఆ ఊరి కట్టుబాటు మీద కథలు చెప్పుకోవడానికీ, రెక్కలు గట్టుకు యెగిరిపోయేరు. కేసూ, పోలీసులూ అనేసరికి గ్రామంలోని ఉద్యోగులు – భయపడి ఇళ్లకు వెళ్లిపోయేరు. పిల్లల్ని కేకలేసి తీసుకుపోతా – చాలా మంది అక్కడి నుండి వెళ్లిపోయేరు. కొంతమంది మాలపేటవాళ్లూ; కొందరు సన్నకారు రైతులూ, లక్ష్మునాయుడి బలగమూ మిగిలేరు. ఎండ – పడమటి గూటికి చేరబోతోంది. ఆకాశంలో పక్షులు అదే పనిగా అరుస్తూ మండపం మీదుగా యెగుర్తున్నాయి.

"బాబూ, నన్నుండమంతారా – యింకా?" పెద్దల్ని అడిగేడు, విధేయంగా గోపన్న సావుకారి "అఖ్ఖర్లేదు. వుండనక్కర్లేదు." అన్నాడు. శ్రీరాములు నాయుడు. అందరూ ఆశ్చర్యంగా చూసేరు... మళ్లీ నాయుడే–

"యిక యీ మండపం వుండనఖ్ఖర్లేదు." అని చెప్పేసి, మండపం దిగి, చరచరా నడిచి, అక్కడికి కొద్ది దూరంలోని కోనేటికి వెళ్లి, కట్టుబట్టల్తో కోనేరులో మూడుసార్లు తలముంచి మునిగేడు. ఆ తర్వాత తిన్నగా నడిచి, మండపానికి యెదురుగానున్న దేవాలయానికి వెళ్లేడు. చాలా సేపు దేవుణ్ని పూజిస్తూ, అక్కడే వుండిపోయేడు.

ఈలోగా, పోలీసులు వొచ్చేరు. అచ్చు రిపోర్టు తీసుకున్నారు. బాలుడి శవాన్ని, పోస్ట్‌మార్టం కోసం వేన్‌లోకి యెక్కించేరు. సీతారాం్వుడి చేతికి సంకెళ్లు వేసారు. గుమిగూడిన ప్రజలను దూరంగా పొమ్మన్నారు.

సీతారాం్వుడు – సంకెళ్ల చేతుల్తో గ్రామానికీ, మండపానికీ నమస్కరంచి, వేన్ యెక్కేడు. నీరు నిండిన కళ్లతో, వొంటిలో రక్తం గుండెలోంచి ఆధోమార్గంలో మాత్రమే పయనిస్తే కలిగే నిస్సత్తువతో అప్పల్రావుడు, పోలీస్‌వేన్ దగ్గరకు చేరి, సీతారావుండి వేపు చూస్తూ –

"కొడుకా, సీతారాం్వుడా! భూంవి పోతే, కంబరికమే గతి అనీ; ఆ బానిస బతుకు

నీ కొడుక్కి రాగూడదనీ, కొడుకుని సంపుకున్నావు. తండ్రిగా – గొప్ప పనే సేసినావు. గొప్పోడివేనిరా.. గానొరే, వొక తండ్రికి, కొడుకుగా మాత్రం నువ్వు దురుమార్గుడివిరా... ఆఁ!"

పోలీస్ వేన్ దుమ్మురేపుకుంటూ వెళ్లిపోయింది. శ్రీరాములు నాయుడు కోవెల నుండి బయటకు వొచ్చేడు.

"...యింకెందుకూ మండపం? మరఖ్ఖర్లేదు. మనం తీర్పులు చెప్పగూడదు... దేవుడొక్కడే తీర్పు చెప్పాలి. సృష్టికర్తకే ఆ అధికారం. విధ్వంసులకి లేదు. ఔనంతే! విధ్వంసకుడెవరు? సీతారాఁవుడా? శ్రీరాముల్నాయుడా? ఎవరు? " పిచ్చి పిచ్చిగా ప్రశ్నలు వేయసాగేడు శ్రీరాములు నాయుడు.

అక్కడున్న రైతులు కొందరూ; పెద్దలూ నాయుడి దగ్గరకు ఆందోళనగా చేరేరు. వాళ్లందర్నీ చూస్తూ –

"...తవ్వీయండి. కూలదొయ్యండి. మండపం మరొద్దు. కూల్చెయ్యండి" కేకలు వేసుకుంటూ, యింటివేపు నడిచేడు శ్రీరాములునాయుడు......

కళ్లు జిగేల్మన్నట్లు మెరిసింది ఆకాశం. ఆ తర్వాత పెద్దగా ఉరిమింది. శ్రీరాములు నాయుడు వర్తమానంలో కొచ్చేడు. దించిన తల పైకెత్తి చిన్నప్పుల్రాఁవుడి వేపు చూస్తూ –

"మిమ్మల్ని 'అన్నా' అని సంబోధించాలో, చిన్నప్పుల్రాఁవుడని అనాలో తెలీదు గానీ, నన్ను మన్నించండి. మీ తాత బ్రతికుండగా అడగాల్సిన క్షమాపణ – యిప్పుడు మిమ్మల్ని అడుగుతున్నాను..." వొక్కొక్క మాటా, గుండెలోతుల్లోంచి పలికేడు నాయుడు.

ఆ నిశ్శబ్ద రాత్రి, ఆ చీకటిగదిలో, యెవరో యిద్దరు వ్యక్తులు మాట్లాడుతున్నట్లుగా లేదు! ఒక తరం, మరో తరంతో సంభాషిస్తున్నట్టుగా వుంది. ఒక జ్ఞాపకం – మరొక అనుభవంతో సంభాషిస్తున్నట్టుంది.

ఎన్ని... యెన్నెన్ని జరిగేయి.! పంచాయితీ తీర్పు బిడ్డను చంపుకున్న సీతారాఁవుడు, తర్వాత సీతారాఁవుడి పోరాటం, సీతారాఁవుడ్ని చంపింది 'రాజ్యం' అంటారు 'వాళ్లు'! నర్రెంగ చెట్టు కింద నరుడో భాస్కరుడా – కన్నెర్ర జేస్తివయ్య నరుడో భాస్కరుడా! సింగేరీ చెట్టుకింద నరుడో భాస్కరుడా – నీ సిరసూ దీస్తిరయ్య నరుడో భాస్కరుడా!

నెత్తుటిపాట! నెత్తుటిబాట! కర్త, కర్మ, యెవరు...?

"మిమ్మల్ని అర్థం చేసుకోటంలో మా వాళ్లు పొరబడ్డారనుకున్నాను. వ్యక్తిగా నువ్వు ఆదర్శవంతుడివే గానీ, నువ్వొక ఎర్రి పీరువని – మా తాత చెబితే నమ్మబుద్ధిగాలేదు. నువ్వు ముసుగేసుకున్నావనీ, బయటకు కన్పించే ఆదర్శరూపం లోపల – నీ వర్గ ప్రయోజనాలు దాచుకున్నావనీ – చాన్నాళ్ళు అనుకునేవాడ్ని. గానీ, యిప్పుడలా అనుకోవడంలేదు..."

శ్రీరాంవులు నాయుడ్ని చూస్తూ చెప్పేడు చిన్నప్పలరాంవుడు. శ్రీరాములు నాయుడిలో నిర్వేదం కాస్త చెదిరింది.

అంతలో కరెంటొచ్చింది. గదిలోనా, బయటా వెలుగు పరుచుకుంది. బయట వాన చినుకులు నేల తల్లితో సంభాషిస్తున్నాయి.

"మిమ్మల్ని మా తాత క్షమించ గలడనుకున్నారా?" ప్రశ్నించేడు చిన్నప్పల్రాంవుడు. ఆ ప్రశ్న మరోలా విన్నించింది శ్రీరాములు నాయుడికి. మళ్లీ యెక్కడలేని దిగులూ చోటు చేసుకుంది. దిగులుగా, చిన్నప్పల్రాంవుడి వేపు చూసేడు. చీకటి ఆకాశంలోనించి వర్షించే దుఃఖాన్నంతట్నీ మూటగట్టి, మూపునమోస్తూ, వెలుగుకోసం పయనించే యాత్రికుడిలా కన్పించేడు చిన్నప్పల్రాంవుడు.

"చరిత్ర క్షమాపణల్తో దిద్దబడదు!" మళ్లీ చిన్నప్పల్రాంవుడే పలికేడు.

ఈసారి హోరున గాలి వీచింది. కళా పెళా ఆకాశం కల్లోలమైంది. మళ్లీ కరెంట్ పోయింది. సన్నని వాన తుంపర – ఎందరో పసిపిల్లల కన్నీటి ధారలా!

"నా మీదుగా చరిత్ర నడిచిపోయింది బాబు...!" దీర్ఘ నిశ్వాసంతో చెప్పేడు శ్రీరాములు నాయుడు.

ఆ జవాబు వినవే లేదు – చిన్నప్పల్రాంవుడు నడుస్తోన్న చరిత్రలా వెళిపోయేడు.

❋ ❋ ❋

సన్నని వాన తుంపర – తడిచిన రెక్కల్ని పక్షి పిల్లలేవో విదిలిస్తే రాలిన తుంపర్లలా! ఆ వానతుంపరలో తడుస్తూ, ఆ ఊరి వీధిలోంచి – తన వాడవేపు నడిచేడు చిన్నప్పల్రాంవుడు. ఊరికీ, ఆ వాడకీ సరిహద్దు దగ్గర – విశాలమైన ప్రహరీతో రైస్‌మిల్లొకటి – దండయాత్ర కోసం వెలసిన సైనిక శిబిరంలా వుంది. దాని ప్రక్కదోవ గుండా వాడదోవలోకి వొచ్చేడు. వాడకి ముందర గల స్కూలు బిల్డింగు దాటుతోంటే – ఆ బిల్డింగ్‌లోంచి –

"యిచ్చోటనే... లేత యిల్లాలి నల్లపూసల సౌరు గంగలో కలిసిపోయె"... పద్యం విన్పించింది. స్కూల్ వరండాను వల్లకాడుగా, తాను కాటిసీను హరిశ్చంద్రుడిగా – భావించుకుని, పద్యాలు పాడటం, ఆ తర్వాత అక్కడే నిద్రబోవటం – బోనెల ఎర్రయ్యకి అలవాటు. ఎర్రయ్యను భార్య వదిలేసింది. చిన్నప్పల్రావుండు స్కూల్ వరండాకి వెనుకవేపు నుంచి నడిచి వాడలో కొచ్చేడు.

అలనాటి పూరి గుడిసెల వాడ – డాబా గదుల కాలనీ అయ్యింది. కోలనీ కోసం... తను నడిపించిన పోరాటం గుర్తు కొచ్చింది. చీకటిలో కోలనీ ట్విన్నులు పోల్చుకోవటం కష్టంగా వుంది. కొన్నిట్విన్నుల ముందర సైకిల్ రిక్షాలు గుడారాలేసుకు నిల్చున్నాయి. ఒకటి, రెండు ట్విన్నుల దగ్గర ఆటో రిక్షాలు కన్పించేయి. ఎదురుగా కన్పించేదే

జానేషు ట్వీన్ను. అది దాటి మలుపు తిరిగితే ఆశీర్వాదం ట్వీన్ను. వీళ్లిద్దరి ట్వీన్నుల్లోనూ ఛార్జింగ్ లైట్లు వెలుగుతున్నాయి. మనుషులెవరూ అలికిడిగాలేరు. నిద్రబోయేరేమో! వీళ్లిద్దరి ట్వీన్నులూ – గ్రామంలోని పెద్ద రైతుల బిల్డింగులకు తీసిపోనట్టున్నాయి. ఆశ్చర్యంగా క్షణకాలం చూసి, మలుపు తిరిగి, తన యింటివేపు అడుగులు వెయ్యబోతే – తన యింటి గడపలోంచి వో కుక్క బయటికొచ్చి, చినుకుల్లో కొద్దిసేపు నిల్చొని, చెవుల్ని టపటపా కొట్టుకొని, ఒళ్లు దులపరించుకొని–ఆశీర్వాదం గడపవేపు పరుగెత్తింది. దానికి యెదురుబడకుండా చీకట్లో నక్కి, అది పారిపోయేక–తన యింటి గడప యెక్కేడు చిన్నప్పర్రాౘవుడు. తలుపు సందులోంచి యింట్లోకి చూసేడు. లోపల, వొత్తిబాగా తగ్గించిన దీపం వెలుగు...! నిద్రిస్తోన్న శ్వాస...!

కుడిచేతి వేళ్లతో, మెల్లగా తలుపు తట్టేడు. తలుపు మీద అలా తట్టడం వొక సౌంజ్ఞ. సరిగ్గా యిలాగే చిన్నాయిన సీతారాౘవుడూ తట్టేవాడు. తొలిసారిగా, యీ యింటిలోనే భుజాన తుపాకీతో చిన్నాయనను చూడటం! అర్ధనగ్న దేహంతో, భుజాన యేదో వొక వ్యవసాయక పనిముట్టు మోసే వో పేదరైతు, తుపాకీ మోస్తూ కన్పించేడు.

పి.యు.సి. పరీక్షలు రాసేసి వొచ్చిన రాత్రి తలుపు తట్టిన శబ్దం. తను తలుపు తీస్తే – చిన్నాయిన లోనకొచ్చి, గడియపెట్టడం.

గదిలో వో కుక్కి మంచమ్మీద – గాయపడ్డ భీష్ముడిలా అప్పర్రాౘవుడు తాత. అవతల పంటపంచలో అవ్వా, అమ్మా, ఎదురుసాలలో – నాయినా నిద్రిస్తున్నారు. చిన్నాయిన మంచమ్మీద కూచొని వోసారి తాతవేపు చూసేడు. తాత, అప్పుడే అంపశయ్య మీద అటూ, యిటూ దొర్లి నిద్రలోనే–

"నాయినొరే, సీతారాౘవుడూ! నువ్వు నీ కడుపుల అగ్గి పెట్టుకున్నావా? నా తలకి కొరివి పెట్టేవా? సెప్పు, సెప్పుర్నాయినా?" ప్రశ్నిస్తూ, వెక్కి వెక్కి యేడ్చేడు కాసేపు. చిన్నాయిన మౌనంగా కాసేపు విని, తర్వాత నన్ను, తన ప్రక్కన కూచో బెట్టుకొని –

"బాబూ, చిన్నప్పర్రాౘవుడూ! నువ్వు మనుషుల్ని సూసేవా?" అని ప్రశ్నించేడు.

'ఆయన మాట – నాకు బోధపడలేదు. కన్న కొడుకుని చంపుకున్నందుకు జైలు పాలయిన చిన్నాయిన, రెండేళ్ల తర్వాత కన్పించి, పలికిన తొలిమాట అది! వింతగా చిన్నాయిన వైపు చూస్తుంటే –

"సిన్నాయిన రూపూ, రేకా; మాట తీరూ మారిపోయినాయిరయ్యా! సదువు నేర్చినట్టుగుంది. సదువు మా కానిది! గ్యేననేత్రం. మాకా నేత్రాలు లేవు. అందికే, నువ్వు సదువుకో. బాగా సదువు. లోకంలోని సదువంతా సదివీ..." కోర్టు వాయిదాలకు వొచ్చే చిన్నాయినను చూసి, అట్నించి హాస్టల్‌కొచ్చి, సంతోషంగా తాతయ్య తనతో చెప్పేమాటలు గుర్తొచ్చేయి.

మళ్లీ చిన్నాయినే–

"చూసుండవు. దుష్ట ప్రెపంచం – మనిసిని జెంతువు జేస్సింది. మనిసిలోని మంచినంతట్నీ దేవుడికిచ్చేసి – చెడు మాత్రమే మిగుల్చుకున్నాము. బాబోరే! దేవుడు గుడుల్లోన వున్నట్టిగా – మనుషులు జెయిళ్ల వున్నార్రా..." వొక ఉద్వేగంతో మాట్లాడుతున్నాడు చిన్నాయన.

రెండేళ్లుగా, చిన్నాయన లేని ఆ యిల్లు – తడిసిన నువ్వుల మూటలా – దుఃఖంతో నానిపోయింది.

పంచాయితీ పెద్దల్లో వొకడిగా, దళితవాడ నుండి గుర్తింపు పొందిన అప్పల్రాంవుడు తాత – పంచాయితీ తీర్పు ప్రకారం గోపన్నసావుకారి బాకీ తీర్చాల్సివొచ్చేసరికి – కొడుకుల్ని వొప్పించలేపోయేడనీ, పంచాయితీ సందర్భంగా చాలా సేపు– తనబాకీకీ, లోకరీతికీ లంకెబెట్టి, యెవరో యజ్ఞం చేస్తే, తాము సమిధలయ్యేమనీ కబుర్లు చెప్పి – పెద్దల చేత తనది 'అప్పు' కాదని అన్పించబోయేడనీ, తక్కువ కులం వారికి, తక్కువ బుద్ధులే వుంటాయనీ... రకరకాలుగా గ్రామంలో వ్యాఖ్యలు.

గ్రామపెద్దలు దాదాపుగా – అప్పల్రావుడితాతను అప్రకటితంగా బహిష్కరించేరు. నడిపినాయనలు యిద్దరూ – భయంతో ఊరొదలి వెళ్లిపోయేరు. పురోణీకాయితం చించేసి, అప్పల్రాంవుడూ! నీ భూమీ వొద్దు, నీ తగువులూ వొద్దని ముసలయ్య వెళ్లి పోయేడుగానీ – ఆ భూమిని లక్ష్మునాయుడు స్వాధీనం చేసుకున్నాడు.

భూమి పోయి, మనవడు పోయి, కొడుకులిద్దరు వలసబోయి, వొకడు జైలు పాలయి, ఊరిలో మర్యాదా, మన్ననాపోయి... దుఃఖపు మూటలా మిగిలేడు అప్పల్రాంవుడు తాత.

కాసేపు మౌనంగా కూర్చొని, కంఠంలో యేదో లక్ష్యం నింపుకున్న స్వరంతో–

"జెయిలు నుండి తప్పించుకున్నాము" అని చెప్పేడు చిన్నాయన.

భయమూ, ఆశ్చర్యమూ కలిగేయి.

"బాబూ, అప్పల్రాంవుడూ! జేగర్తగా విను. మానవ ప్రపంచమింత నరకబాధలు పడడానికీల్లేదు. వొక పసిపిల్లడిలాగ – మాయామర్మంలేని మనిసి ప్రపంచమిది. సృష్టిలోని జంతుజాలాల్నిండి, మనిసొక్కడే ప్రేమ, అభిమానమూ, సహకారమూ లాంటి గుణాల్తోటి గొప్పవోడయినాడు. ఎప్పుడో, యెక్కడో, మనిసి కర్కోటకుడైనాడు. దురుమార్గుడయినాడు. ఆడు పెత్తనం జేసాడు. నాకు సరిగా చెప్పటం రాకంటంది!

అదిగో నా తండ్రి! అప్పల్రాంవుడితోటి వోదించినాను. దురమార్గమేదో, ఎక్కడో జరగతంది. మనల్ని మింగతందిరా అన్నాను. గాని, దానికి యిరుగుడు చెప్పలేకపోనాను. అప్పటికి నాకూ తెల్దు! తెలిస్తే..." అలనాటి తన చర్య గుర్తుకు రాగా, చిన్నాయన గొంతు

తడిసింది. గొంతు సవరించుకుంటుండగా, అప్పుల్రాఁవుడు తాతకు మెలకువ వొచ్చినట్టుంది.

"యోవుళూ? యెవుల్రా నాయినా?" అనడిగేడు నిద్రకళ్లతో.

"చిన్నాయన...!"

"నీ(నయ్యా, సీతారాఁవుడ్ని!" వొకేసారి పలికేం యిద్దరమూ.

ఆశ్చర్యంతో, గభాల్నా మంచం దిగేడు తాత. చిన్నాయినను ఆపాదమస్తకం – దుఃఖపు కళ్లతో చూసేడు. చిన్నాయనను పట్టుకొని, గుండె, కడుపూ, శిరసూ... స్పృశించి, స్పృశించి ఆ తర్వాత అలాగే కూలబడి, భూమి లోలోతు పొరలు కంపించినట్లుగా – కంపిస్తూ, కుమిలి కుమిలి యేడ్వసాగాడు.

అప్పటికి మాత్రం – తాతయ్యతోపాటూ, కంటతడి పెట్టేనేమో! గానీ –

"యిదే, యీ దుఃఖమే, యీ రోదనే, యీ గాయమే మనిషికి కలగగూడదు. ఆదిమ సమాజంలో మనిషికి యీ గాయంలేదు. ఒకవేళ యెన్నడో కలిగినా అది ప్రకృతి వలన తప్ప, సాటి మానవుడి వలన కలగలేదు. 'ఆస్తి' అనే భావనే గాయం. ప్రకృతిని స్వాధీనపర్చుకొని, ఆ మేరకు స్వంత పరచుకోవడాన్నే 'ఆస్తి' అంటాము. చరిత్ర అంతా సమిష్టి ఆస్తిని వ్యక్తిగత ఆస్తిగా మార్చుకున్నందుకు జరిగిన ఘర్షణే..." సహచరులు, తొలినాళ్ళలో దుఃఖంతో తను గుండె విప్పినపుడు; తన గాయాలను 'వాళ్లు' అనుభవించి, విశ్లేషించి చెప్పారా అన్పించింది, యీ మాటలు 'వాళ్లు' చెప్పినపుడు.! ఏడ్పు చూసినపుడల్లా–గుర్తొచ్చే మాటలు –

"ఏడ్వనీ! ఓదార్పుగాదు, అసలు యేడుపేలేని లోకం నిర్మించబోతున్నాముగా" అన్నట్టు చూసేడు చిన్నాయన. కాసేపటికి, దుఃఖపు కంపన తగ్గి, నిస్సత్తువయి, నిద్రకమ్ముకోగా – జీర గొంతుతో తాతయ్య –

"నాయినా, సీతారాఁవుడో! నా తలతీసీ! నాకు తలకొరివి పెట్టీ, అంతేగానొరే నాయినా గుండెకాయలోన దమట (మంట) పెట్టుకురా. దమట పెట్టకు..." అంటూ అలా, నేలమీద సోలిపోయేడు.

ఆ తర్వాత కొంతసేపు – తనకు జైలులో పరిచయమైన కమ్యూనిస్టు విప్లవకారుల గురించీ, ఏజెన్సీ ప్రాంతంలో వాళ్లు నిర్మించిన గిరిజనోద్యమం గురించీ తన యెరుక మేరకు వివరించి – మళ్లీ కలుస్తానని, తుపాకీ సర్దుకొని, తన అజ్ఞాత ప్రయాణం సాగించేడు చిన్నాయిన. పసిపిల్లడికి... పరమ ప్రపంచం సాక్షాత్కరమై మాయమైనట్లయ్యింది. చిన్నాయిన వెళ్లిపోయేక తలుపు గడియ పెట్టినా, చాలాసేపటిదాకా మనసు తలుపులు మూతబడలేదు.

తలుపు తెరుచుకుంది. ఎదురుగా అమ్మ!

చిన్నప్పుల్రాఁవుడి ఆలోచనలు ఆగినయ్. తల్లి సంభ్రమాశ్చర్యాల్తో కొడుకును చూస్తూ

నిలబడిపోయింది. చిన్నప్పల్రాంవుడు యింటిలోకి నడిచి, తలుపుగడియ పెట్టేడు చిరుదీపపు వెలుగులో వోసారి తల్లినీ, యింటినీ చూసేడు. చినుకులకు కొద్దిగా తడిసిన తలను – దండెమ్మీద తుండగుడ్డ తీసి తుడుచుకోసాగేడు.

తల్లి – గూటిలో దీపానికి వొత్తి పెంచింది. నలిగిన, మడతలు పడిన చీరలో పత్తిలా తెల్లగా పండిన జుత్తుతో – ఎన్నో జన్మలను మోస్తూ బతుకున్నట్లుగా వుందామె! కూటికుండ దగ్గరకు వెళ్లింది. సత్తుగిన్నెలో కూడు నింపి, గెంజిపోసి, పచ్చి మిరపకాయలు రెండు, గూటిలో వెదికి పట్టుకొని – చిన్నప్పల్రాంవుడి ముందుకొచ్చి – "నాయినా, బువ్వ తినవా..." అనడిగి, కంచం అతని ముందు పెట్టింది.

అప్పటికి చినప్పల్రాంవుడు, తల తుడిచేసుకొని, దండెం మీద తుండు ఆరేసి, నిల్చున్నాడు. ఎన్నాళ్లుగా, యెన్నిసార్లు అలా బువ్వగిన్నె పెట్టుకు – కొడుకు కోసం యెదురు చూసిందో ఆమె! చిన్నప్పల్రాంవుడికీ యెన్నడులేని ఆకలి వేసింది. మూపు మీది కిట్‌బ్యాగ్‌తో అలాగే వొచ్చి, గిన్నె ముందు కూర్చున్నాడు. భుజానికి వేలాడే తుపాకీనీ, వొడిలో పెట్టుకున్నాడు.

అతనికెదురుగా కూర్చుంటూ తల్లి, తుపాకీని చూపిస్తూ–

"తిండి కాడా అదుండాలేటి నాయినా?" అనడిగింది లో గొంతుతో.

ముద్ద మింగుతుండగా యీ ప్రశ్న! చిన్నప్పల్రాంవుడు పొలమారేడు. ఆందోళనగా తల్లి – చేత్తో అతని తాడవ మీద మూడు పర్యాయాలు తట్టింది.

"తుపాకీ బరువైతే భుజం మార్చు! అంతేగాని కిందకు దించకు!" మిలటరీ శిక్షణ సమయంలో కామ్రేడ్ బోధన గుర్తొచ్చింది. చినప్పల్రాంవుడు తల్లివేపు సాలోచనగా చూసేడు.

"గెంజి మూడుబుక్కలు తాగునాయినా – పొలబారేవు గదా...." చెప్పింది తల్లి. ఆకస్మాత్తుగా అతనికి పినతల్లి గుర్తుకొచ్చింది. తన తల్లి కంటే యెక్కువగా తనను చేరదీసినది పినతల్లే! చంపబడిన బిడ్డడ్ని తనలో చూసుకునేదామె. చిన్నాయిన జెయిల్లోనుండగా, యేమనేవాడోగానీ, జైలునుండి తప్పించుకొచ్చేక, పినతల్లికి విడాకులిస్తానన్నాడు. పినతల్లి మొత్తుకుంది. గానీ చిన్నాయిన వినలేదు – 'నా వలన తన సంతానాన్ని పోగొట్టుకుంది. ఇక ముందు నీనేటవుతానో? వొద్దు ఆమెని మరో పెళ్లిజేసుకోమనండి! ఆమెకి నేను చెయ్యగలిగే నేయం యిదొకటే' – అనేవాడు చిన్నాయిన. పినతల్లి చేసిన పొరపాటు కాదన్నమాట విడాకులకు కారణం! దాంతో, యింట్లో యెవ్వరేమనలేకపోయారు.

"యెప్పుడు పొలబారినా – మీ సిన్నాయిన తలస్తండు, సూసేవా అననేది పిన్నమ్మ" జ్ఞాపకాల్లోంచి పలికేడు చిన్నప్పల్రాంవుడు.

తల్లి ఆశ్చర్యంగా చూసింది. 'ఎప్పటి గ్యాంపకాలు...! యిప్పటికీ మోసుకు

తిరుగుతున్నాడా? బంధాలు గూడా తెంపుకోలేదన్నమాట! ఈ యింటిల... యెవరూ బోధపడరు – అత్తా, మామ, భర్త, మరుదులు – కడాకి సంతానం.... యెవుళూ బోధపడరు! అనుకుంది తల్లి.

ఆమె మరింతగా దుఃఖంతో మూల్గింది. చల్లగాలి గాని సోకిందా – జల్లు జల్లులుగా వాన కురిపించ – నీటిని మోస్తోన్న ఆకాశంలా వుందామె.

చిన్నప్పుల్రాంవుడికి, ఆఖరుసారిగా పినతల్లితో మెసిలిన సందర్భం గుర్తొచ్చింది. తన దూరపు బంధువుల గ్రామం – విక్రమపేట రాత్రివేళ ఆ యింటినిండా బంధువులు తిరుగాడుతున్నారు. మరో గంటలో పినతల్లికీ, ఆ యింటి పెద్దకూ రోటి పెళ్ళి! ఆ వేళకి తల్లీ, తనూ చేరటం, పినతల్లి, యెలా చూసిందో, పరుగెత్తుకువొచ్చి, పలుకరించటం, ఇద్దర్నీ పట్టుకు పెరట్లోకి తీసుకెళ్ళి, తనని వొడిలో కూచోబెట్టుకుని–

“అప్పా! యిక్కడికి రావేటో అనుకున్నాను. తెంపీసినారు గావాల నన్ను మీ తోటి అనుకున్నాను.” అంది, తడిసిన గొంతుతో.

“అమ్మీ! నువ్వేనా సుకంగా వుండు. ఇకనించి, నీ యిల్లూ, నీ సంసారం చూసుకో” అంది తన తల్లి.

“అంపకాలు యెట్టేస్తున్నావా అప్పుడే?”

ఇంట్లోంచి, బంధువులెవరో పిలిచేరు. ఓసారి, ఆ పిలుపువేపు చూసి, మళ్లీ–

“అప్పా! పట్నంల చేసిన తప్పుకి శిచ్చ అనుబగించీసినాను, కళ్లు పొరలు యీడాయి! బిడ్డని సంపితే – పల్లెత్తుమాట పలకలేదు. పెనిమిటి చాలనుకున్నాను. ఇదిగో... యీ కొడుకు చాలనుకున్నాను. మరెందుకు యెందుకు...” ఆ తర్వాత ఆమె మాట్లాడలేదు. వొడిలోని తనని – దేహమంతా కంపిస్తుంటే కౌగిలించుకుంది.

“అమ్మీ! నువ్వు తోటి కోడలివేగాని – ఆ యింటి పెద్దకోడలుగా బరువు బాధ్యతలు యెత్తిదించుతున్న నాకు – నువ్వు కూతుర్లాంటిదానివే! ఏటి తప్పు? ఎవుల్ది తప్పు... అని – తేల్సి సెప్పడానికి – యీ జగన్నాటకం బోదపడితే గదా? మన సేతిల మాత్రమేటి లేదు. అంతే తెలుసు...” అని తల్లి యింకేమో చెప్పబోయింది. బంధువులు వొచ్చి, ముహూర్తం వేళయిపోయిందని, పినతల్లిని తీసుకువెళ్లారు. వెళ్లూ, వెళ్తూ తన వేపు చేస్తూ –

“బాబోరే!... నువ్వు మట్టుగ వొస్తావుండుమీ!” అని చెప్పిందిగానీ, ఆ తర్వాత మరి... పినతల్లిని కలువలేకపోయేడు. అపుడపుడూ, ఆమె వార్తల్ని – తల్లి ద్వారానో, తన బంధువుల ద్వారానో తెలుసుకోవడమే! పినతల్లికీ వీలయ్యేది గాదు. ముగ్గురు బిడ్డల తండ్రికి భార్య అయ్యిందామె. తన పేగుతెంపుకు పుట్టిన బిడ్డ ఖండాలుగా నరకబడినాక – ఆమెకు సంతానవతి కావలెనన్న కోరిక చచ్చిపోయింది. అందుకనే, తల్లిలేని ముగ్గురు బిడ్డలకు తల్లిగా వెళ్లింది. వాళ్లనీ, ఆ యింటినీ సాకటంలో మునిగిపోయింది.

"సీతారాఁవుడి స్థూపాన్ని పోలీసులు కూల్చీసింతరాత వొచ్చింది. స్థూపం చుట్టూ ప్రదచ్చిణం జేసిందట. నేలబుగ్గి దీసి ఊరిమీదికి యెత్తిబోసి – శాపనార్థాలు పెట్టిందట! ఇదిగిదే ఆఖరు. ఈ మట్టితోటి మరినాకే సంబంధమూలేదు... నీనే యింటికీ రాను, మనింటికి యెళ్లమని యెవుళో సెప్తే అలగన్నాదట. అంతే కబురు తెలిసి – మేమెళ్లేసరికి స్థూపంకాడలేదు. ఎళిపోయింది. మొండి సేతులోళ్లం – యెవుళి కంటనీరు తుడగలం నాయినా ....?" నిట్టూర్చింది తల్లి.

చినప్పల్రాఁవుడు మౌనంగా, బువ్వ తినసాగేడు, బయట చినుకులు... గాలి చల్లగా వీస్తోంది. పెరిటిలోని కుంకుడుచెట్టు కొమ్మలు ఊగేశబ్దం. గూటిలో దివ్వె కొట్టాడుతోంది. కాసేపయ్యాక, మళ్లీ తల్లి కొనసాగించింది.

"ఊరు మునుపటిలాగలేదు నాయినా! ఎవుళ్నీ నమ్మలేం. కస్టం సుకం చెప్పుకోలేం. అదిగో, అపుడపుడూ – నారాయణమూర్తి మేస్ట్రుగోరితోటే కడుపు సొద సెప్పుకోడం. గానతగాని సొద యెవుళికి సెప్పుకుంతాడు?" ఆగింది తల్లి.

"మేస్టారెలా వున్నారమ్మా? బాగున్నారా?"

"యెవుళూ సుకంగా లేర్నాయినా. ఏఁవి జల్మలివి? పాపిస్టి జల్మలు. మేస్ట్రుగోరి యిల్లు – పందులు పడి దువ్వేసిన సెలక లాగుంతాది! మీరు యెక్కడ, యే అలికిడి జేసినా – ఆ మార్నాడు పోలీసోలు మేస్ట్రుగోరింటి మీదబడి దువ్వేస్తారు" గాయపడ్డ గొంతుతో చెప్పింది అమ్మ.

"మనింటి మీద పడటంలేదా?" ప్రశ్నించేడు చినప్పల్రాఁవుడు.

"ఎందుకు పడలేదు. పడినారు. పండుగా, పున్నమా – అని వుండీదా? అలనాడు మీ చిన్నాయిన కోసరం, యిప్పుడు నీకోసం, అప్పుడంటే – యింటెడు మనుషులం. వొకళ్లకొకళ్లం వోదార్సుకునీవోళ్లం. ఇప్పుడో – మీ నడిపి నాయినలు వేరు కాపురాలైపోయి – ఆళ్ల బతుకు ఆళు బతుకుతన్రు. మీ నాయిన వున్నా, యివన్నీ పట్టవతనికి! వొంటిదాన్నే మిగిల్నాను."

చిన్నప్పల్రాఁవుడికి మెతుకు దిగటంలేదు. తల్లివేపు బాధగా చూసేడు. ఆమె గ్రహించింది. గొంతులో దైన్యాన్ని తుడిచేసి–

"నీనూ మొండికెత్తేస్నాను. నా ఊసూ, జోలికీ రాకుండా జేస్నాను పోలీసోళ్లని" అంది స్వరం పెంచి.

చిన్నప్పల్రాఁవుడు ప్రశ్నార్థకంగా చూసేడు.

బయట చినుకులెక్కువైనాయి. ఎక్కడో మెరుపులు... తలుపు సందుల్లోంచి గదిలోకి వెల్తురు క్షణకాలం! తల్లి కొడుక్కి కాస్తా దగ్గరగా జరిగి–

"వోసారి దీపాల ఆమాస రాత్రి నాయినా – దీపాలు, గీపాలు యెలిగించినాం. కలిగిన కాడికి సోడిపిండి అట్లూ, మినబ్బూరెలూ చేసుకున్నాం. ఇంక, యిలాగ, తినీసి, మీ నాయిన రచ్చబండకి యెళిపోనాడు. నీను తిందుమని కూకుంతన్నాను – వొచ్చీసినారు, మందకి మంద పోలీసులు. ఆళకి ముందర వొకడొచ్చేడు – ఆడికి కాకీ గుడ్డల్లేవు. మామూలు బుష్‌కోటూ, పేంటూ యేసుకున్నాడు. చేతిల చిన్న పిస్తోలు తిప్పుకోని వొచ్చేడు. సోడిపిండి అట్లూ, మినపబూరెలూ చూసాడు. యిను, యిన్నాయినా, అప్పుడికత చెప్తాను" అని, ఉత్సాహంగా, చిన్నప్పల్రాంవుడి వేపు చూసి గతంలోని యావత్ ఘటననూ – దృశ్యీకరించే రీతిలో చెప్పసాగింది.

"ఇవెవురికీ పిండి వొంటలు?" బూటుకాలితో, గిన్నెల్ని చూపి అడిగేడు నాయినా.

"యెవుళు తింటే... ఆళ్లకే..." అన్నాన్నీను.

"ఆడి కోసమే గదా, వండినావు?"

"యెవుళి కోసరం?"

"అప్పల్రాంవుడి కోసం?"

"అప్పల్రాంవుడు కాటిల గల్సిపోయి ఆరుపంటలయినాది. ఆనాడే దినకార్యాలూ జేసీసినాం. సుట్టాలూ, బందుగులందరికీ కబుర్లెట్టినాం. మీకు కవురందలేదా? అనడిగేన్నాయినా..." అంతవరకూ చెప్పి, క్షణంసేపు నవ్వింది. ఆ తర్వాత, అదే నవ్వు మొహంతో–

"ఆ వాఫీసరుకి కోపమొచ్చిందిగావాల. ఇంగిలీసుల తిట్టినాడు. నాకూ కోపమొచ్చి, మన బాసల తిట్టినాను. ఆడికనుమానమొచ్చింది. "ఏంటన్నావూ" అనడిగేడు. 'నువ్వేటన్నా' వడిగేను. అతగాను, పిస్తోలుతోటి వీపు గోక్కున్నాడు. ఆ పక్కనున్న మరొకడు, ఆ వాపీసర్తోటి, నన్ను చూపి "యిదేనండీ! వాడి తల్లి, రంపల రాకాసి. నోరు గల ముండ! గయిరమ్మ. దీని పేరు..." అని చెప్పేడు.

నీనేటన్లేదు. పిస్తోల్తోటి గోక్కున్నోడే–

"అప్పల్రాంవుడి మనవడేడీ?" అనడిగేడు.

"యే మనవడు? అప్పల్రాంవుడికి నలుగురు కొడుకులు. నలుగురిల ఆఖరోడు సీతారాంవుడు, అతగాన్ని మీరే సంపినారు. అతగానికి వొకడే కొడుకు. ఆ కొడుకుని పంచాయితీ మండపం చంపింది. నడిపి కొడుకులిద్దరికీ నలుగురు కొడుకులు, పెద్ద కొడుక్కి వొకడూ, మొత్తం అయిదుగురు మనవలు. ఏ మనమడు కావాల?' అని అడిగేను.

నా రెక్కలు పట్టుకొని, యింటి బయటికి యీడ్చుకొచ్చేడు. ఇంట్లోని వంటల్ని బూటు కాళ్లతో, నేలపాలు చేస్నాడు. "బండబూతుకూతలు కూసేడు. నా గుండెల మీదకి తుపాకులు గురిబెట్టి 'చెప్పు! నీ కొడుకొస్తాడా యీ రోజు? నీ కొడుకు ఆచూకీ చెప్పు!

చెప్పకపోతే కాల్చేస్తా" మన్నాడు…" తల్లి ఆగింది. గుక్క తిప్పుకుంది. కళ్ళల్లో నీళ్లు చేరబోతే, సముదాయించుకొని–

"….ఆఖరికి చెప్పొన్నాయినా… బాబులూ, యిది నా యిల్లు. నా యింటిల… నా బిడ్డా, పాపల్తోటి సుకంగా బతకాలనే వుంతాది నాకు. ఈ యింటిని వొదిలీసి దేశమంతా నాదే అనుకొని యెళిపోన్డు నా బిడ్డ! ఆ బిడ్డడి కోసమే యీ ఆకరి దినాల్ల యిల్లు కనిపెట్టుకొని చూస్తన్ను.

నాయిన్లారా, యీ బతుకుల అన్నీ అనుబగించీసినాను. పుట్టింటినిండి యీ మెట్టినింటి కొచ్చేను. బంధుబలగంతోటి బతికేను. ఎక్కడ, మరియేటయ్యిందో, బలగం పోయింది. బతుకు పోయింది. తొలిసారి యీ యింటిల పసిబిడ్డ నెత్తురు వొలికింది. అక్కడికాంచి నెత్తురూ, కన్నీరూ! సూడండి. నా రెండు కళ్లూ – నెత్తురూ, కన్నీరూ కారస్తన్నాయి. ఇంతలేసి తుపాకులూ, అంతలేసి బలగాలూ, అంతంత రాజ్జెమూ, నెత్తురూ, కన్నీటి సుక్కల్ని ఆపలేవా? అలగయితే యెప్పుడూ, యే తల్లికీ, బిడ్డల ఆచూకీ అడక్కండి. బిడ్డల యేటకి తల్లి గూటికి రాకండి.

మరొకసారిగానీ వొచ్చేరా, యీ యింటి దూలానికి, మీ కాకీగుడ్డల్ని యేలాడగట్టి ఉరేసుకుంతాను. ఆఁ. అంతే….. ఆఁ…" అని చెప్పి, ముగించి, మౌనంగా వుండిపోయింది తల్లి.

చిన్నప్పట్నుంచి రాఁవుడికి, ఆకాశంలోని చందమామను చూపించి, ఆరుబయట, గరికనేల మీద తనకు గోరుముద్దలు తిన్పించిన తల్లి జ్ఞప్తికొచ్చింది. పాలుదాపిన తల్లి, చేలగట్ల మీద నడకలూ, పరుగులూ నేర్పించిన తల్లి, పలకా పుస్తకాలిచ్చి బడికి సాగనంపిన తల్లి, పలకమీద "అమ్మ" అని రాసి 'నువ్వు' అని చూపితే, పరవశించే తల్లి, బాల్యం ఊయల వూపిన తల్లి గుర్తొస్తోంది. గానీ జీవితం చివరిద్వారం దగ్గర నిరీక్షిస్తోన్న యిప్పటి వృద్ధ రూపం అతని మనోపలకమ్మీద కన్పించటంలేదు.

బాల్యం – మరణం దాకా జ్ఞాపకముండే వసంతం… యెవరికైనా!

అన్నం తినటం పూర్తయింది. నోరూ, చేయీ కడుక్కున్నాడు. అక్కడే, అలాగే గోడకి చేరబడినాడు. తల్లిని చూస్తూ. "అమ్మా నను కన్నందుకు విప్లవాభివందనాలు. రాలిపడిన పూవులకై, గాయపడిన పిట్టలకై ప్రాణమివ్వనేర్పినావు… అమ్మా, ననుకన్నందుకు విప్లవాభివందనాలు" పాట గుండెల్లో కదలాడింది. ఆపాట పాడటం తనకెంతో యిష్టం. ఎందరో సహచరులు యెన్నిసార్లో ఆ పాట పాడించుకున్నారు. పాడుతున్న ప్రతిసారీ తనకేవో కొత్త అనుభూతులు పల్లవిస్తాయి.

"చావు నన్ను సమీపించి, గుసగుసలాడక ముందే ఆంక్షల సంకెళ్లు దాటి నిన్ను వొక్కసారి చూడాలని, నా చివరి కోర్కె. చివరి కోర్కె…"

కవీ యెలా గ్రహించావయ్యా... మా గుండె ఘోష! క్షణకాలం, చిన్నప్పరావుడు ఆ పాట రాసిన కవిని తలచుకున్నాడు.

ఆ తల్లికి మాటలు పూర్తయ్యేక దుఃఖం ముంచుకొచ్చింది. మౌనంగా, నీటిలో ముంచిన మట్టి కుండలా... కన్నీరు కారుస్తోంది. ఎప్పటివో, యేవేవో ఆమె గుండెల్లో కదలాడసాగేయి. పంచాయితీ తీర్పు, భూమి అమ్మకం, సీతారాంవుడు కొడుకుని చంపుకోవడం, అరెస్టూ జైలు నుంచి పరారీ, గ్రామంలో ఘర్షణలూ... కళాపెళా కళాపెళా మరుగుతున్న నీటిలాంటి... జీవితం... యిందులో ఆమెగూడా....

మొదట కూలిగింజలగొడవ గుర్తొచ్చిందామెకు...

మునిమాపువేళ ఊడుపు పూర్తిజేసి, గట్టేక్కేరు మహిళలు.

సాయంత్రపు ఎండ బంగారు రంగులో వరినాట్ల మీద పడ్తోంది. గాలికి రేకుల్ని అల్లాడిస్తూ వరినాట్లు కృతజ్ఞతలు తెల్పుతున్నట్లున్నాయి. యింత విధ్వంసం తర్వాత గూడా, యిన్నినాళ్ల తర్వాత గూడా ఆమెకు వరినాట్లే కళ్లముందు కదలాడేయి... ఆ వెంటనే... అదే మునిమాపువేల లక్ష్మునాయుడి గడపలో...

“కుంచం మార్సి కొలమంతే యినబడదేట్రా?” ఆదెమ్మ అరిచింది.

గుంపస్వామి గడపలో మంచమ్మీద కూర్చున్న లక్ష్మునాయుడి వేపు చేసేడు.

‘‘ఏమే, నోరెక్కువయ్యిందేటి? అరస్తన్నావు’’ చుట్టకొసకొరికి, ఊసేడు లక్ష్మునాయుడు.

“మూడడ్ల కుంచమిది. పాటికుంచం,! ఇదిగాదు, శిఖా కుంచంతోటి కొలండి...!” తగ్గలేదు ఆదెమ్మ.

“గుత్తగత్తెకు లేనినోరు నీకెలాగొచ్చిందే?” మళ్లీ, అదే నిర్లక్ష్యం లక్ష్మునాయుడిలో.

“ఔను! కూలి గింజలకాడా మీరు సెయ్యివిప్పరా?’ తను తొలిసారిగా వొక అన్యాయాన్ని యెదిరిస్తూ మాట్లాడిందపుడు.

“అంతే, యేటి? మీం, మీ కళ్లకి యెలాగవుపడతన్నామే?” లక్ష్మునాయుడిలో అసహనం ప్రవేశించింది. అతనికి సీతారాంవుడు జైలు నుంచి తప్పించుకొచ్చి, యెక్కడో ఏజన్సీలో నక్సలైట్లతో కలిసి తిరగుతున్నాడంటే తిరిగితే తిరగనీ, యేదో రోజు పోలీసు కాల్పుల్లో చనిపోడా అనుకుంటే; సీతారాంవుడు యిక్కడా కూలీనాలీలను రెచ్చ గొడ్తున్నాడని, రహస్యంగా వొచ్చీ, పోతున్నాడనీ... తెలుస్తోందడంతో, ఆగ్రహంగా వుంది.

“మీమెలాగలవుపడతన్నాం, మీ కళ్లకి?” ఆదెమ్మ తిరిగి ప్రశ్నించింది.

“నాయురాళ్లలాగవుపడ్తన్నావే నువ్వు మాత్రం” అసహనం అణుచుకొని, వ్యంగ్య బాణం విసిరేడు లక్ష్మునాయుడు.

"నాయురాళ్లమే అయితే నీ గడపకి కూలి గింజలకొస్తామేటి? మీమూ నాయురాళ్లలాగ కూలిగింజలు కొలమేటి?"

"నాయురాళ్లయిపోడంకేనేటి సంగాలంటంఁడట?"

"అవన్నేల? కుంచం మార్చి, కూలి, గింజలు కొలండి" తను కల్పించుకుంది రెండోసారి. ఎందుకో, తనకు భయం కలుగుతోంది నాయుడితో మాటాడుతుంటే.

"కొలకపోతే యేటిజేస్తారే....?" మంచం మీంచి లేచేడు నాయుడు.

"ఉడిసిన నాట్లు పీకి పారెస్తాం"

ఆదెమ్మ శిగపట్టుకొని, వొంచి, మంచం దగ్గరకి యీడ్చి–

"ఎంత ధైర్యమే, నంజికూతురా! నోటి కొచ్చిన కూతలు కూస్తావా? మీ దిక్కున్నకాడ చెప్పుకోండి. కూలి గింజలు కొలనుగాక కొలవను" అని తోసివేసి, యింట్లోకి వెళ్లిపోయేడు. ధాన్యం కొలిచే గుంపస్వామి, భయంతో వొణికిపోతూ, నిల్చున్నాడు. పొద్దు పూర్తిగా వాటారిపోయింది. చీకటి కమ్ముకుంది. అవమానంతో ఆదెమ్మ కూలబడింది. మిగిలిన వాళ్లంతా యెలాగున్నారోగానీ – తను మాత్రం కంపించిపోయి, అప్పటికప్పుడే నాయుడి చర్యకు ప్రతీకారంగా–

"వొరే, వోరోరె, గుంపసోమీ! మీ బుగతకి సెప్పు. ఈ ధాన్యం గింజలు మీము యెత్తుకుపోతన్నాంవని. నువ్వుగాని, మీ బుగతగాని అడ్డుకుంతే, ఆడోళ్లసేత తన్నులు తింతారని సెప్పు..." అని గుంపస్వామికి చెప్పి–

"చూస్తారేటంఁరా. ఎత్తండి గంపలకి... యీ ధాన్నేన్ని" అని తనూ గంపకెత్తుకుంది. అందరూ, గంపలకెత్తారు. ఆదెమ్మ, సంతోషంగా లేచింది. అంతా ధాన్యపు గంపల్తో కదుల్తూ, లక్ష్మునాయుడి గడపమీద ఉమ్మి ఉమ్మేరు. మళ్లీ తనే, గుంపస్వామితో–

"యిదిగిదిగో! లచ్చునాయుడు బుగతా, ఆదెమ్మకి చెమాపణ చెప్పేదాక, నీ మడిసెక్కల్లోన నాట్లు పడవు. గుత్తగత్తె గయిరమ్మ మాటకి తిరుగులేదు..." అని ప్రకటించింది.

ఆ తర్వాత నాట్లు బంద్ – ధాన్యం కొల్లగొట్టేరని కేసులు పోలీసులు, రాజీలు.... మళ్లీ కూలిపన్లు... మళ్లీ యెక్కడో గొడవ... ఈసారి భూమికోసం జరిగిన ఘర్షణ గుర్తుదెచ్చుకుంది...

భయంతో, ఊరొదిలి వెళ్ళిపోయిన మరుదులు యిద్దరూ – మళ్లీ ఊరిలోకి వొచ్చేరు. తీర్పుకి కట్టుబడి అమ్మకానికి పెట్టిన భూమి మీదకి ఏరుబూసేరు. లక్ష్మునాయుడు. తన మనుషుల్తో కొట్టించేడు. సీతారాంవుడు గోపన్న సావుకారికి ఉత్తరం పంపేడు. గోపన్న సావుకారి, లక్ష్మునాయుడ్ని బ్రతిమాలి, భూమిని... తిరగి తమకి అప్పగించేడు. గొడవలూ, రాజీలూ, గెలుపులూ, వోటమిలూ... చావులూ, వొక దీర్ఘనిట్టూర్పుదీసి–

"నాయినా! యిదిగిది యెన్నాళ్లింకా? ఇదంతా యేటి నాయినా?" గొంతుతోగాక, గుండెతో పలికినట్లు జీరగా పలికిందామె. ఆమె యెంతకాలం నుంచీ వేచి వున్నదో, యెన్ని ఆలోచన్లీ, మాటల్నీ చిలికి, కవ్వం పట్టి ఆ రెండు ప్రశ్నల్నీ వేసిందో – అన్పిస్తోందా తల్లిని చూస్తే!

చిన్నప్పలాఁవుడికా ప్రశ్నలు తన మొత్తం ప్రయాణానికి సంబంధించిన ప్రశ్నల్లా విన్పించేయి.

'అమ్మా! యిది జీవితం. ఇది యుద్ధం. జీవితంలో, యుద్ధం లేనిదెక్కడ? ఎప్పుడు....? మృత్యువుతో క్షణక్షణంచేసే యుద్ధమే జీవితం. 'అమ్మా! వో జ్ఞాపకం నన్నెపుడూ వెన్నాడుతుంది. అది గాయం... కూడా. పచ్చని పొలాలూ, గుబురు తోటలూ, మధ్యలో వోపల్లె, పల్లెకు ఉత్తరాన మాలపల్లె, అక్కడ, వో యింటిలో, నాయిన గుండెలమీద ఆడిన బాలుడు – తాత భుజాల మీద గుఱ్రప్పండేస్తే ఊరినీ, పొలాలనీ, పంచాయితీ మండపాన్నీ చూసేడు.

'భూమి మీద – తమ వొంటి చెమటా, నెత్తురూ బోసిన మనుషులు. రాసులుగా తీసిన పంటలు, పంటలు! ఆ మనుషుల యిల్లు పంటలు – వాళ్ళ కల్లాలూ కలలూ. పంటలూ – వాళ్ల బంధువులూ... పంటలేవాళ్లు!

పంటల్ని కొల్లగొట్టేందెవరోగానీ నెత్తీనోరూ కొట్టుకుంటున్న వో మానవ రూపం... వో పంట చేను... ఎన్ను గింజల తలను నలుదిక్కులా బాదుకోవటం... మండపమ్మీద – పంచాయితీ దగ్గర... నెత్తురు గక్కిన పంట, శిరసు తెగిన... ఎన్ను గింజ! అది నాకు గాయమా... జ్ఞాపకమా...?'

లోలోపలి ఉద్వేగాన్ని అదుపు చేసుకొని బయటకు –

"... యిది యెప్పుడో, యెక్కడో యెవరో ఆరంభించేరమ్మా! మన బ్రతుకులకొచ్చేసరికి, మనం ఆరంభించినట్లన్పిస్తాది. గానీ యుద్ధం – మనకు ముందే ఆరంభమయ్యింది. మనతో అంతమూ అయిపోదు.

ఎన్నాళ్లింకా అన్న ప్రశ్నకు... బతుకులున్నంతదాకా! పంటలున్నంతదాకా! యేమో..." అని జవాబుగా చెప్పేడు.

తల్లికి అతని మాటలేమీ బోధపడలేదు. గానీ, కొడుకు లోలోపల తడిగా వున్నట్లూ, కన్నీటితోనో, నెత్తుటితోనో తడిసినట్టూ కన్పించేడు. అలా కన్పించేక కొడుక్కి దగ్గరగా వొచ్చి, అతని భుజాలను చేతుల్తో తడిమి, స్పర్శించింది. ఆ తర్వాత అతని వొడిలోని తుపాకీని గూడా వోసారి స్పర్శించి –

"మీ సిన్నాయిన సీతారావుడు – అలాటిపని చేసుండకపోతే బాగుణ్ణు. అసలకి

ఆ పిల్లడికి – కోడిపిల్ల పీకకొయ్యడం రాదు. బియ్యిం. ఆదేటో, మరలగ...?" యీ యుద్ధం అప్పుడారంభమయ్యిందన్న అర్థంలో మాట్లాడింది.

చిన్నప్పల్రాంవుడికి తల్లి యేమంటోందో ప్రశ్నయ్యింది. చిన్నాయిన, యే పని చేసుండాల్సింది గాదంటోంది...? కొడుకుని చంపుకోవడమా? లేదా తర్వాత్తర్వాత జైలు నుంచి పరారయి ఉద్యమించడమా?

యీ ప్రశ్నలు మళ్లీ గతంలోకి లాగేయి చిన్నప్పల్రాంవుడిని !

* * *

అవి పట్నంలో తను డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న రోజులు. హాస్టల్ గదికి – పోరాత్రి సమయంలో చిన్నాయినా, మరో వ్యక్తీ వొచ్చేరు. ఇద్దరూ చెరో సంచినిండా, యేవో మందులూ, దుస్తులూ, పుస్తకాలూ మోసుకొచ్చేరు. తెల్లవారు ఝామున బయల్దేరుతామనీ తమని పట్నం దాటి, తూర్పువేపు పది కిలోమీటర్ల దూరంలోని పల్లె దగ్గరకు చేర్చేందుకు సహకరించమనీ అడిగేరు. వారికి భోజనం యేర్పాట్లు చేసి, వార్ని, తెల్లవారు ఝామున దిగెబెట్టేందుకు రెండు స్కూటర్లూ, యిద్దరు మిత్రుల్నీ సిద్ధం చేసాడు, తను. ఎంతో ఉద్వేగంగా వుండేది. చదువుకున్న పుస్తకాలలోని వీరగాథల్లో పాత్రలు ప్రత్యక్షమయినట్లుండేది. భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్, అల్లూరి సీతారామరాజు గుర్తుకు రాసాగేరు. వారితో బంధుత్వమన్న... ఉద్వేగం! నలుగురు మిత్రుల్ని కూడబెట్టుకొని చిన్నాయన ముందు కూచోవటం. చిన్నాయిన ఏజన్సీ ప్రాంతంలోని గిరిజనోద్యమం గురించీ, అక్కడి షావుకార్ల, ఫారెస్టూ పోలీసు అధికార్ల దోపిడీ దౌర్జన్యాలెంత అనాగరికంగా, రాక్షసంగా వుండేవో – వాట్ని తమ ఉద్యమం యెలా యెదుర్కొంటోన్నదో చెప్పసాగేడు. కంబారిగా (పాలేరు) బతికే గిరిజనుడు కమ్యూనిస్టుగా మారి, యెలా పోరు సాగిస్తున్నాడో తన్మయుడై వివరిస్తున్నాడు చిన్నాయిన. ఆయనకు గూడా యీ అనుభవం అనూహ్యం గదా!

మిత్రులేవో ప్రశ్నలు వేసారు. జాతీయోద్యమంలో మోసం జరిగిందా? కమ్యూనిస్టులీ దేశంలో యెందుకు విఫలమైనారు? కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్... యిపుడెందుకులేదు? మీకు రష్యా, చైనా సాయం జేస్తాయా? మీ దగ్గర ఆయుధాలెన్నున్నయ్.... ప్రశ్నలు... ప్రశ్నలు.

చిన్నాయిన అవాక్కయిపోయేడు. అయోమయంగా, తనతోపాటు వొచ్చిన వ్యక్తివేపు చూసేడు. ఆ వ్యక్తి నిదానంగా వున్నాడు. చిర్నవ్వుతో మమ్మల్ని చూసేడు. తెల్లనిఛాయ, మొహంలో వింత వెలుగు... కళ్లు నీలంగా, ఎదుటి మనిషి అంతరంగాన్ని దర్శించేవిలా వున్నాయి. ఆయన, గొంతువిప్పి–

"కామ్రేడ్స్" అని సంబోధించేరు.

తొలిసారిగా 'కామ్రేడ్!' అని సంబోధించబడినందుకు గుండెల్లో యేదో అనిర్వచనీయ పులకింత కలిగింది.

ఆయన కొనసాగించేరు.

"నిజమే! విద్రోహం జరిగింది. జాతీయోద్యమంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఓడించినా నిజమైన ప్రజస్వామిక స్వాతంత్ర్యం మనకు రాలేదు. రాజకీయాధికారంలో పైపైన మార్పులేవో జరిగి వుండొచ్చు. గానీ, సాంఘిక వ్యవస్థలోగానీ, ఆర్థిక నిర్మాణంలోగానీ ప్రధానమైన అంశమేదీ మారలేదు. నిజానికి, సామ్రాజ్యవాదుల దోపిడీ మరింత ఉధృతంగా సాగుతోంది. కమ్యూనిస్టులు ఆదిలో యీ దేశంలో పాలకవర్గాలను సరిగ్గా అంచనా కట్టలేక పోయేరు. పాలకవర్గాలలో అభ్యుదయ కాముకులకోసం వెదుకులాడేరు. పాలకవర్గ ప్రయోజనాలకోసం సాగే పంచవర్ష ప్రణాళికలూ, శ్రేయోరాజ్య పథకాలూ "యజ్ఞం" అని కమ్యూనిస్టులు గుర్తించలేక విఫలమైనారు.

రక్తసిక్త గిరిజనుడే యిపుడు విప్లవానికి బాటవేసాడు. మీరు యువకులు. విద్యార్థులు. భావిభారత సమాజం మీది. ఆలోచించండి! స్వాతంత్ర్యం ముందరి చరిత్రా, తర్వాతి చరిత్రా వర్తమానమూ అధ్యయనం చెయ్యండి! దేశ దేశాల్లో ప్రజలు విప్లవిస్తున్నారు. మిమ్మల్ని వున్న పళంగా, యిలా మాతో ఉద్యమంలోకి వొచ్చెయ్యమని కోరను. గానీ, వీటిని గురించి యెరుకలో వుండండి. ఈ ఉద్యమాల్లో మీ తండ్రులూ, తల్లులూ, అన్నలూ, అక్కలూ వున్నారని గ్రహించండి... మీ సహాయ, సానుభూతులు అందించండి..." సుదీర్ఘంగా వివరించేరు.

ఏదో వ్యక్తం చెయ్యలేని శక్తి తన దేహంలో ప్రవహించింది. చాలాసేపు నిద్రపట్టలేదు! తెల్లవారుఝామున చిన్నాయిన నిద్రలేపాడు. అప్పటికే, వాళ్లు భుజాలకు సంచీలు తగిలించుకుని సిద్ధమై వున్నారు. గబగబా తనూ, మరో మిత్రుడూ, మొహాలు కడుక్కొని బయల్దేరటం.

దారిలో ఆ కామ్రేడ్‌తో ఊరి గురించీ, పంచాయితీ తీర్పూ, చిన్నాయిన చర్యా మాట్లాడగా, ఆయన, ఆ ఘటనల వెనక, వుండే రాజకీయార్థిక విషయాలు చెప్పేరు. సరిగ్గా అర్థం కాలేదు.

వాళ్లు దిగవలసిన స్థలం వొచ్చింది. మా నుండి వీడ్కోలు తీసుకుంటుండగా, ఆ కామ్రేడ్‌ని–

"యింతకీ, తప్పెవరిది? శ్రీరాములు నాయుడుదా? మా తాత అప్పలాంవుడిదా?" అని ప్రశ్నించేను గదా. నాకింకా, యేదో విశదంగాలేదు ఆ నాటికి!.

శ్రీరాములునాయుడు ఆర్థికాతీత రాజకీయాలుంటాయనుకున్నాడు. అప్పలాంవుడు

రాజకీయాతీత జీవితం ఉంటుందనుకున్నాడు. ఇద్దరివీ యిరుపక్షాలకు చెందిన, రెండు అమాయక, అజ్ఞాన జీవితాలు... ఆ కామ్రేడ్ జవాబిచ్చేరు.

ఆ జవాబు అప్పటికెంత అర్థమయ్యిందో...?

ఇన్నాళ్లకి, మళ్లీ తల్లి వేసిన ప్రశ్న. ఆనాటి విశ్లేషణను గుర్తుజేసింది! చిన్నప్పల్రాంవుడు ఆలోచనల్లో వున్నాడు.

అప్పటిదాకా హోరున కురిసిన వర్షానికి గాలి గూడా తోడయినట్లుంది. పెరటివేపు స్తలాల్లో, చెట్ల కొమ్మలు ఊగే శబ్దాలు, తమ పెరటిలోన కుంకుడుచెట్టు కొమ్మ విరిగినట్టుంది, పెళ్‌పెళ్‌పెళా శబ్దం చేసింది.

తల్లి, వోసారి ఆ శబ్దం వింది. తర్వాత, కొడుకువేపు చూసి –

"మరియెలగ నడిసేడో! యేసిన ప్రతీ అడుగూ యెరగని దోవల యేసినవే. సీతారావుడి వొక్కో అడుగూ, మీ తాతకి యోజనాల దూరం జేసింది. బెంగెట్టుకున్నాడు ముసిలోడు. ఎవుర్నీ, దేన్నీ, ఆపలేడు. ఏటో...? ఒక సుడిగుండం అయ్యింది నాయినా. బతుకు... గిర, గిరా, గిరా, తిప్పేసింది. గిల, గిలా కొట్టుకున్నాం" వొక్కొక్కటీ, పొరలు పొరలుగా తవ్వుకుంటోందామె గతాన్ని......

"నూతుల చెరువు బంజరెవుళ్ది?"

"భగవొంతుడిది"

"భగవొంతుడెవడు?"

"భాగ్యవంతుడు"

"అయితే మరి, భాగ్యవొంతుడితోటి కయ్యిమాడి, జయమవగలరేటి? పాపిస్టిపన్లు గాకపోతే భగవంతుడితోటి పంతాలేట్రా...? వొదిలేయండి, వొదిలేయండి భూంవు లొదిలేయండి!"

నూతుల చెరువు యెగువ బంజరుభూమి సాగుకి దిగిన కూలిరైతులపై దాడి జరిగింది. పట్నం ఆసుపత్రిలో పదిమందిదాకా క్షతగాత్రులై చికిత్స పొందుతున్నారు. పోలీసులు క్షతగాత్రుల పేర్లూ, వయస్సూ, ఘర్షణ వివరాలూ రాసుకుంటున్నారు.

"అప్పల్రాంవుడి పెద్దకోడల్ని!" – అని తను జవాబు చెప్పింది.

"నువ్వెళ్లావా... భూమికోసం?"

"భూదేవి రైతోడికి తల్లి! ఆ తల్లికి దూరమైనోడు కూలోడు"

"నువ్వెళ్ళావా?"

"...."

"పలకవేమీ?" గద్దించేరు.

కొద్ది దూరంలోని బెడ్స్‌మీద చికిత్స పొందుతున్న నడిపి కొడుకులిద్దరి దగ్గర వున్న మామ అప్పల్రాంవుడు యిదంతా చూసి, దగ్గరకొచ్చేడు.

శరీరంలోని కండరాలన్నీ, కరిగి, కరిగి ఎముకల మీద తొడుగులా చర్మం వేలాడుతోంది. పైన వొక మాసిన బనియనూ, చిలకట్టు పంచె! తెల్లటి గడ్డంలోంచి నల్లటి కళ్లదీపాలు...! అప్పల్రాంవుడు కళ్లతో మాట్లాడుతున్నట్లుగా–

"ఇదిగీ నూతుల చెరువు బంజరు సాగుజేసుకోరా అప్పల్రాంవుడూ, నీకేం ఫర్లేదు. నువ్వూ, నీ పిల్లలూ భూమిలేనోళ్లయిపోరు. గోపన్న సావుకారి బాకీకి నీ జిరాయితీ భూమి అమ్మేసినా–అనన్నారు బాబూ పంచాయితీ పెద్దలు! ఆనాడు ఆ మాట మరెందుకన్నారో...? బాబయ్యా! ఆ బంజరు బంగారవే పండుతాదో, యెండే పండుతాదో ఆ వూసొది లీయండి. దాన్ని సాగు సెయ్యడంకి మాకాడ మదుపులేదు. ఆ మదుపుకోసరం అప్పువోడాల. ఆ అప్పు మళ్లా వొడ్డీల్తోటి పెరిగిపోయి ఆ భూమిని మింగేస్తాది. కష్టపడటం మా వొంతు, అనుబగించడం అప్పిచ్చినోడొంతు అవతాది. పెద్దలు ఆలోసించి ఆ బంజరు గోపన్న సావుకారికే యిప్పించి మమ్మల్ని రుణ విముక్తుల్ని సెయ్యండన్నాడు మా సీతారాంవుడు ఆనాడు!

పెద్దలమాట జరగలేదు, సీతారావుడి మాటా జరగలేదు! ఆనాడు పంచాయితీ మండపం మీద రగతం సిందింది. ఈనాడు భూదేవత మీద రగతం సిందింది. అది ఎవుళి రగతం...? ఇదెవుళి రక్తం...? 'రగతానికి కులమేటి? మతమేటి?' అంతారు పెద్దలు! బగవొంతుడి సృష్టి అంతా సమానమంతారు...! మరిదేటి?" ప్రశ్నలు వేసాడు. పోలీసులు ఆశ్చర్యంగా చూడసాగేరు. ఆసుపత్రికొచ్చిన వాళ్లెవరో కొందరు చుట్టూ గుమిగూడేరు.

"రక్తం బయటికి కనపడకుండా మనిసిసెంవటా, సత్తువా సప్పరించీసింది బావూ వొర్తకం! ఇపుడా సంపదా, పెత్తనవూ మనిసి నెత్తురిని పిండుతంది. ఆం! ఇపుడూ, అపుడూ యిదే, యీ నెత్తుర్నాపలేక నా నెత్తి నీను బాదుకుంతన్నాను" అని, నెత్తిమీద చేతులేసుకు యేడ్చేడు అప్పల్రాంవుడు మామ.

పోలీసులేమనుకున్నారో, మరి తనను మళ్లీ ప్రశ్నించలేదు. ముసిలోడ్ని కూడా యేమనలేదు. ఈలోగా యెవురో పత్రికా విలేకర్లట వొచ్చేరు. వారూ, పోలీసులూ కాసేపు మాట్లాడుకున్నారు. ఆ తర్వాత విలేకర్లు గాయపడ్డ వారిని ప్రశ్నించేరు.

"మీ మీద ఎవరు దాడి చేసారు?

"భగవంతుడు!" ఓ గాయపడ్డ వ్యక్తి జవాబు.

విచిత్రంగా చూసేరతన్ని విలేకర్లు. గుర్రుగా చూసేరు పోలీసులు.

"భగవంతుడా? అదెవరు?" మళ్లీ ఓ విలేకరి ప్రశ్నించేడు.

"భాగ్యవొంతుడు!" అదే గాయపడ్డ వ్యక్తి జవాబు మళ్లీ.

"మరి, తర్వాత మీరేం చేస్తారు? దీనికి బదులు తీసుకుంటారా?"

"మీమా? భగవంతుడితోటీ, భాగ్యవొంతుడితోటీ... కయ్యాలా? పొరపాట్న బదులు సెప్పాలనుకున్నా భగవొంతుడు అగుపడడు. భాగ్యవొంతుడికేమేనా జరిగితే యాళ్లొప్పుకోరు..." అని పోలీసుల్ని చూపించేడొక గాయపడ్డ వ్యక్తి.

విలేకర్లకి రాసుకోదగ్గ వార్తలందినట్లలేదు. అసంతృప్తిగా వెళిపోయేరు. గాని ఆ తరాత వారం తిరిగేసరికి...? గాయపడినవాళ్లంతా ఆస్పత్రి నుండి తిరిగొచ్చేరు. మళ్లీ భూమి సాగుకెళ్లేరు. ఈసారి రెవిన్యూ అధికార్లూ, పోలీసులూ వొచ్చేరు. భూమి సాగుకెళ్లిన రైతుల్ని జైలుకి పంపేరు. అప్పుడు ఆడవాళ్లని భూమిసాగుకి దిగమన్నాది సంగం. దిగేం! జైలుకి వెళ్లేం, అనుబగించేసాం అన్నీ, తగువులూ, తంటాలూ, జెయిళ్లూ, బెయిల్లూ... ఆ తరాతో...?

"ఆళ్లు, భూముల్లాక్కున్నారు. బతుకుల్లాక్కున్నారు. పంటలు లాక్కున్నారు. పంచాయితీలు నడిపినారు. మన చావులకి ఆళ్లు తీర్పులు చెప్పేరు. అది, మరి చెల్లదు. చెల్లగూడదు. అవతలవాళ్లు ముసుగులు తీస్సేరు. శ్రీరాములునాయుడు వొక ముసుగు ఆళ్లకింతదాకా! ఇపుడు ముందుకొచ్చినోడు అక్షుంనాయుడు! ఆడు యుద్ధమారంభించినాడు. దెబ్బమీద దెబ్బ గొడతండు. ఆడు బతికివుంతే మనకి చావులు రాస్తాడు. ఆడి చావు మనమే రాయల... ఆం..." వో. రాత్రి రహస్య సమావేశం సీతారాంవుడి ప్రకటన..."

ఆమెకన్నీ పుస్తకంలోని ప్రతి అక్షరాన్నీ, స్పర్శించి, చదివేట్లుగా గుండెలో కదుల్తున్నాయి. దీర్ఘంగా, యేవైపో చూస్తూ.

"భూంవులకాడ భూంవికోసం మనంవూ, ఆళ్లూ కొట్లాడుకున్నాం. అది లెక్కలోకి రాలేదు. గాని, అదిగా లచ్చున్నాయుడ్ని, అతగాని యింటిల సంపదంతోటి పులుల మందని పుల్లల్తోటి పొడిసినట్టగయ్యింది. దిగిపోనాది, బలగం! ఇల్లు గదిల్తే యినప టోపీ పోలీసులు! పొలాలంటా... తుపాకులే! చెల్లాచెదురైపోనారు జనం. సీతారావుడికీ జెనానికీ మద్దెన తుపాకులూ, లారీలూ, జెయిల్లూ దడిగట్టీసినాయి. ముసిలోడ్ని – కొడుకు ఆచూకీ చెప్పమని కొట్టి, కొట్టి కొసాకి మీసాలకి అగ్గెట్టారు" పొరకు, పొరా విప్పుకు మాట్లాడుతోంది తల్లి.

చినప్పల్రాంవుడికి... ఆ ఘటనల తర్వాత కొన్నాళ్లకు హాస్టల్‌కొచ్చి, చిన్నాయిన సీతారాంవుడు కలిసిన సందర్భం గుర్తుకొచ్చింది.........

చిన్నాయిన బాగా అలసిపోయినట్టున్నాడు. మనిషి నీర్సంగా కన్పించేడు. సంచీలో యేవో కాగితాలు తీసి, వాటిల్లోంచి కొన్ని చిరునామాలు యిచ్చేడు. ఆ చిరునామాల వార్ని కలిస్తే తాతయ్య, నడిపినాయినల, అరెస్టయిన గ్రామస్తుల విడుదలకు సహకరిస్తారని చెప్పేడు.

ఒక ముఖ్యమైన సమావేశానికి బెంగాల్ వెల్తున్నామనీ; పదిరోజుల తర్వాత వస్తాననీ చెప్పేడు. రాత్రి రైలుకి వెళ్లిపోయేడు. చిన్నాయిన యిచ్చిన చిరునామాల వారిని కలియటం! కొత్త పరిచయాలు. కొత్త ప్రపంచం... వొకే సామూహిక స్వప్నావిష్కరణకోసం.... కలలుగనే వాళ్లు... చరిత్ర, రాజకీయాలు, సాహిత్యం, అన్నీ ఆ కలల ప్రపంచంలో నేర్చుకోవటం! వాటిలో మునిగితేలటం!

ఆ తర్వాత అరెస్టయినవారంతా విడుదల. గ్రామంలో సభ. పట్నం నుంచి తమ సామూహిక స్వప్న బృందం సభలో నృత్యప్రదర్శన!

కొద్ది రోజులకే పట్నంలో వో హోటల్ వద్ద చిన్నాయిన పోలీసులకు చిక్కడం, ఆ రాత్రే ఎన్‌కౌంటర్ పేరిట పోలీసులు కాల్చి చంపేయటం...

పట్నంలో స్మారకసభ. పోలీసుల పహరా మధ్య!

మండపమ్మీద తెగిన బాలుని శిరస్సునుంచీ, అరుణపతాకకు నెత్తురద్దిన చిన్నాయిన సీతారాంవుడిదాకా క్షతగాత్రగానాన్ని తను విన్పించటం! తను గాయకుడా? ఎప్పుడు కాగలిగేడు? గాయాన్ని మోసినవాడా? గాయకుడా? సాయుధుడా?

“లచ్చున్నాయుడి కొడుకులు ఆ తరాత పగతీర్సుకున్నారు. అందరి మీదా కేసులెట్టేరు. ఊరిల పోలీసుకేంపు. మున్సబు కరణాల కచేరి అక్కడే. సూరెంబాబు రాత్రుళ్లు పట్నమెల్లిపోయివోడుగానీ, పగలు ఊరిలుండేవోడు. రాత్రీ, పగలూ నిద్రులుండేవి గాదు. దుఃఖం, దుఃఖం... సీకటి, సీకటి! అనుబగించీసినాం, సరి అనుకుంతే, మళ్ళా నువ్వు! కొడుకా! నాకేటీ తెల్దు. బతుకుల సీకటే సూసినదాన్ని. నన్ను తప్పుబట్టకు...” తల్లి గతం పొరలన్నీ విప్పుకుని, చివరిగా పలికింది.

అక్కడ, తల్లి వొదిలేసిన దగ్గర తారట్లాడింది చినప్పల్రాంవుడి హృదయం... తన యింటిలో వరుసగా రెండు దీపాలారిపోయినయి. నడిపినాయనలు యేదోవొక కేసు మీద జెయిలులో. తన తండ్రే యింటిలో మిగిలిన పెద్ద దిక్కు, గానీ, ఆయనకు యివేవీ పట్టేవిగాదు. అందుకనే ఆయన్ని క్షమించారేమో, గ్రామ పెత్తందార్లు.

వొద్దనేవాడుగాదు కావాలనేవాడూ గాదు. అలీనంగా వుండటం అతనికి యెలా సాధ్యమయ్యింది? తను చదువు ఆపేసి, వొచ్చేస్తానన్న సందర్భాన మాత్రమే మాట్లాడేడు–

“యిక్కడ నీకేటున్నాది? భూంవికోసరం వొలికిపోయిన నెత్తురున్నాది. నెత్తురు కోసరం.... కారిసీ కన్నీరున్నాది. గాని, భూంవిలేదు. బతుకులేదు. ఇక్కడికి రావొద్దు...” అన్నాడు.

చదువు, చదువు....చదువు. డిగ్రీ కాలేజీ నుంచి యూనివర్సిటీకి. అక్కడా అనివార్యమైన ఆందోళనలు... ఘర్షణలు...క్యాంపస్‌లో పోలీసులు... హాస్టల్ గదుల్లో రహస్య

ఎజెండాలు! చదువుతున్నట్టుగా వుండేదా...? ప్రవాసజీవితంలా వుండేది...! అక్కడ్నించి అలా... అజ్ఞాతజీవితం...! ఆనాటికి గ్రామంలో చాలా మార్పులొచ్చేయి! అలనాడు, పంచాయితీ మండపం మీద యెంతకీ తగవు తీరకపోవటంతో అటు పెద్దల్నీ, యిటు మాలల్నీ ఝుణాయించి దులిసేపిన అన్నమయ్య యిపుడు లేడుగానీ అతని కొడుకు శివన్నారాయణ యిపుడు గ్రామంలో నాయకుడు.

శివన్నారాయణ తనకంటే అయిదేళ్లు పెద్ద. డిగ్రీ చదువాపేసి, గ్రామంలో రాజకీయాల్లోకి దిగేడు. శివన్నారాయణకి మునసబు మద్దతుంది. శ్రీరాములునాయుడి కాలంలో మునసబుకి వుండే అధికారమూ, సంపదా లక్ష్మునాయుడి పెత్తనంలో తగ్గేయి. ఆ వైరం తీర్చుకోడానికి మునసబు యెదురు చూసేడు. శివన్నారాయణ కన్పించేడు.

లక్ష్మునాయుడి హత్య జరిగాక లక్ష్మునాయుడి కొడుకులిద్దరూ తండ్రి బాటలో నడిచేరు. దౌర్జన్యాన్నే ఎంచుకున్నారు. మరోవైపు ప్రజల మీదకు పోలీసుల్ని ఎగదోలేరు. జనవ్యతిరేకులైనారు.

శివన్నారాయణ మాత్రం తెలివిగా పావుల్ని నడిపేడు. లక్ష్మునాయుడి కొడుకుల వలన జైలు పాలయిన వారికి జామీనులిచ్చి విడిపించేడు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని సంక్షేమ పథకాలు రైతుకూలీ సంగసభ్యులకే వొచ్చేట్లు చూసేడు. ఏ భూములకొసం పోరాడేరో, ఆ భూముల పట్టాలకోసం ప్రయత్నించేడు. లక్ష్మునాయుడి కొడుకు సర్పంచ్‌గా వుంటే శివన్నారాయణ ప్రతిపక్ష పాత్ర పోషించేడు. ఆ తర్వాత, పంచాయితీ హరిజన్లకు రిజర్వయితే... నడిపినాయనని సర్పంచ్‌ను జేసాడు. నడిపినాయనపుడు అధికారం తనవాకిటకొచ్చిందను కున్నాడు. అది, 'అక్షయపాత్ర' అనుకున్నాడు. గానీ, అది శివన్నారాయణ యింటనే వరాలు కురుస్తుందంటే, నమ్మాడా? తన వాదన విన్నాడా...? శివన్నారాయణ, శ్రీరాములునాయుడి వర్తమానరూపమా...? కావచ్చు అని తేల్చింది నారాయణమూర్తి మాస్టారు!

"అమ్మా! వర్షం తగ్గిందా...? చూడుమీ...!"

చెప్పేడు చినప్పర్రాంవుడు. అతనికోసారి నారాయణమూర్తి మాస్టార్ని కలువాలన్పించింది.

తల్లి, నెమ్మదిగా తలుపుతెరచి, బయటకి వెళ్లి, చూసివచ్చి–

"చినుకులు ఆగిపోనాయి. గాని, మేఘం పట్టు వొదిల్నట్టగలేదు" అని చెప్పింది.

"నారాయణమూర్తి మాస్టార్ని కలవాలనుందమ్మా...!"

"అతగానూ, యెన్నిసుట్లో అన్నాడు 'యెవులేనా కలిస్తే బాగు'ణ్ణుని! ఈ మద్దెకాన సేన్నాళ్లయి అలికిడ్లేదట మీరు! అజయబాబు యెలగున్నాడు నాయినా...?" అడిగింది తల్లి.

అజయబాబు మాస్టారి చిన్నకొడుకు. చినప్పర్రాంవుడితోపాటే యూనివర్సిటీలో

చదువుకున్నాడు. అక్కడి విద్యార్థుల సమస్యల మీద, యూనివర్సిటీ యాజమాన్యంతో ఘర్షణలో ముందుండేవాడు. రాడికల్ స్టూడెంట్ యూనియన్‌ను సమర్థతతో నడిపేడు. పరిస్థితుల రీత్యా, పార్టీ నిర్ణయం రీత్యా, చినప్పల్రావుడు యూనివర్సిటీ నుంచి అజ్ఞాతంలోకి వెళిపోగా అజయ్, కొన్నినాళ్లు యింటిలో వుండి, తర్వాత ఉద్యమంలోకి వొచ్చేస్తానని యూనివర్సిటీ నుంచి యింటికి వెళ్లేడు.

గ్రామంలో మారిన పరిస్థితులు అప్పటికి గ్రామం మండల కేంద్రంగావటం– కొత్త రాజకీయ పార్టీలో శివన్నారాయణ ప్రవేశించటం, పదవుల కోసం ప్రయత్నాలు, ప్రజల్ని తనవెంట భ్రమల్లో వుంచి నడుపుకోవటం – ఆ స్థితిలో అజయ్ గ్రామ ప్రవేశం.

అప్పుడో సమస్య నలుగుతోంది. పేదలకు పక్కా బిల్డింగులకోలనీ శాంక్షనైంది. దానికోసం సేకరించాల్సిన స్థలం సమస్య అయ్యింది. ఆ స్థలంలో "నాగావళీ ట్వయిన్స్" నూలుమిల్లు పెట్టడానికీ, వెనకబడిన ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధికి ముందుకొచ్చిన వాడిగా సూర్యెంబాబు కొడుకు మల్లిబాబు ప్రయత్నాలు. శివన్నారాయణ యెటూ తేల్చడు. ఆ సమస్య పరిష్కారంలో అజయ్‌బాబు విజయవంతమయ్యేడు. అప్పటికే వున్న ఆ గ్రామంలోని సూర్యంబాబు రైస్‌మిల్లుని పేల్చివేసాడు అజయ్‌బాబు. ఆ తర్వాత మల్లిబాబు ట్వయిన్‌మిల్లు ప్రయత్నాన్ని పట్నానికి మార్చుకున్నాడు. గానీ అజయ్‌బాబు అప్పటి నుంచి అజ్ఞాతవాసం ఆరంభించాల్సి వొచ్చింది.

చినప్పల్రావుడికి – అజయ్, తన అజ్ఞాతవాసం ఆరంభం గురించీ, మాస్టారితో ఆ రాత్రి జరిగిన సంభాషణ గురించీ వుద్వేగంతో చెప్పే మాటలు గుర్తొచ్చేయి...

"వేకువ ఝాము బ్యాగ్ సర్దుకున్నాను. ఇంట్లో అమ్మ నిద్రబోతోంది. ఓసారి లేపి చెప్దామా అన్పించింది. చెప్తే ఆమె వెళ్లనిస్తుందా? ఏడుస్తుంది. మొత్తుకుంటుంది! వొద్దనుకున్నాను. అమ్మకప్పుకున్న దుప్పటి తెరచి అమ్మ మొహాన్ని చూసి, బయల్దేరేను. గడపలో మంచమ్మీద నాన్న...! దుప్పటి తొలగించేను. నాన్న నవ్వు మొహంతో 'లాల్‌సలాం కామ్రేడ్!' అన్నారు. ఆశ్చర్యమూ, అనుమానమూ కలిగేయి. ఆయనలేచి–

"నాకు తెల్సు. నిర్ణయం నీది. అయితే, నువ్వు యూనివర్సిటీకి గాదు వెళ్తున్నది ప్రపంచంలోకి, ప్రపంచం మార్చడానికి. వొక ముసలితల్లీ, దండ్రీ నీ ప్రయాణాన్ని యెందుకాపుతారు నాన్నా?" అనన్నారు. కాసేపాగి యేదో ఆలోచించి.

"నాకేమన్నా చెప్పాల్సింది వుందా కామ్రేడ్!" అనడిగేరు. నరాలన్నీ పొంగినయి. నెత్తురు పోటెక్కింది. వొకానొక ఉద్వేగంతో ఆయన పాదాలకు దండంపెట్టి వొచ్చేసాను" అని అజయ్ చెప్పిన మాటలు గుర్తొచ్చేయి.

"అజయ్ బాగానే వున్నాడమ్మా. ఆయన రావాల్సింది. కడుపులో నొప్పి

వొస్తోందతనికీ మధ్య. ఆపరేషన్ చెయ్యించాలి. ఆ యేర్పాట్లలో వున్నాం...” అని చెప్తూ, కిట్ బ్యాగ్ సర్దుకుని, లేచాడు చినప్పలరాఁవుడు. తుపాకీని భుజానికి వేలాడదీసేడు.

“.... యీ సీకట్ల, మేస్ట్రుగోరి యిల్లు పోల్సగలవో, లేదో? వొక్కడివే యెల్లగలవా? నీనొచ్చేదా?” ఆ తల్లి, సందేహాల్ని వెల్లబుస్తూనే వుంది. చినప్పల్రాఁవుడు. అన్నీ సరిచూసుకొని “వస్తానమ్మా!” అని చెప్పి, యింటి నుంచి బయలుదేరాడు.

“కొడుకా! జేగర్తనాయినా!” అంతే అనగలిగింది. గానీ గుండెలోపల యెన్నెన్నో... ఆ తల్లికి!

❊ ❊ ❊

చినప్పల్రాఁవుడు తన పేటదాటి, మేస్టారింటి పెరటివేపు దోవలో నడక సాగించేడు. గ్రామం నిద్రలో వుంది. కురిసిన వర్షానికి వాతావరణం చల్లగా వుంది. ఇళ్లముందరి పశువుల సాలల్లో పశువులు వరిగడ్డిపరకల మీద మోరలుచాచి కదుల్తున్నాయి. కొన్ని పశువులు తోకల్తో మూపు మీద వాలిన దోమల్నీ, ఈగల్నీ తోల్తున్నాయి. ఆకాశంలో మబ్బులు చెదిరపోయేయి. అక్కడక్కడా నక్షత్రాలు వొంటరిగా బిడ్డలకోసం యెదురుచూసే తల్లుల కళ్లల్లా కన్పిస్తున్నాయి. చేతికర్ర తాటిస్తూ నడిచే వృద్ధునిలా ఆకాశంలో చంద్రుడు...! నిర్బంధాల్తో నిస్తేజమైన జనసమూహంలా వర్షంతో తడిసిన ప్రకృతి!

మాస్టారి యింటి పెరటివేపు ఎలుగు (కంచె) దాటి, వంటపంచ దగ్గరకొచ్చేడు చినప్పల్రాఁవుడు. పెరటి తలుపులు తీసి వున్నాయి. అనుమానంతో, కాసేపు చీకట్లో నిల్చొని, యింట్లో శబ్దాలకోసం చెవివొగ్గేడు. ఏమీ వినబడలేదు. మెల్లగా, వంటపంచదాటి మండువా కొసకొచ్చి వారగా నిలబడి పడగ్గది వేపు చూసేడు. ఆ తలుపులూ తెరచే వున్నాయి. లోపల జీరోవాల్టు బల్బ్ వెలుగుతోంది. కరెంట్ వొచ్చినట్లుంది!

వర్షానికి మెలకువ వొచ్చిన తర్వాత మరి నిద్రపట్టడంలేదు నారాయణమూర్తి మాస్టారికి. మంచమ్మీద అలా రెప్పలు తెరిచి, యేవో ఆలోచనల్లో వున్నారు. చినప్పల్రాఁవుడు ఆయన దగ్గరకు చేరి –

“మాస్టారూ!” అని పిలిచి, లాల్‌సలాం చేసాడు.

మాస్టారు ఆశ్చర్యంగా చూసేరు. చినప్పల్రాఁవుడు అనుమానంగా, తలుపులు వేపు చూపిస్తూ–

“అన్నీ తెరిచే వున్నాయేంటి...?” అనడిగేడు.

మాస్టారు మంచమ్మీద లేచి కూచొని చిన్నగా నవ్వి–

“తలపులన్నీ మీకై తెరచివుంచినాను అని పాడుతూ, మా మైత్రీ సభ్యుల్ని ఆహ్వానించాలి” బదులిచ్చేరు.

అర్థంగాక అయోమయంగా చూసి, దగ్గర్లోని కుర్చీలాక్కుని కూర్చున్నాడు. చినప్పుల్రాఁవుడు.

"ఎప్పుడుబడితే అప్పుడు వొచ్చి, తలుపులు బాదేస్తారు. ఇంటిలో చొరబడతారు. తలుపులు పాడవకుండా తెరచి వుంచటమారంభించేను. ఇదీ తప్పే! తెరచి వుంచితే యిప్పుడే వెళిపోయేరా 'వాళ్లు' అని ప్రశ్నిస్తారు. పోలీసులు యిపుడు మాకు మైత్రీ సభ్యులు" అని, వో నిట్టూర్పు వొదిలి –

"వుండు! తలుపులు వేసొస్తాను" అని చెప్పి, పెరటి తలుపూ, మునివాకిటి తలుపూ వేసొచ్చేరు మాస్టారు.

కొంతసేపు యిద్దరూ మౌనంగా కూచున్నారు.

"గురువమ్మ కూతురింటికి వెళ్లింది. చిన్న మనవరాలు పుష్పవతయ్యింది..." చెప్పేరు మాస్టారు.

మళ్లీ మౌనం! ఏం మాట్లాడాలో, యెక్కడారంభించాలో తేలటం లేదు చినప్పుల్రాఁవుడికి! అజయ్‌బాబు గురించి అడుగుతారేమోనని యెదురుచూసేడు. మాస్టారింకేదో ఆలోచనలో వున్నారు. చినప్పుల్రాఁవుడుకి స్థూపం పునర్నిర్మాణ విషయం గురించి మాట్లాడాలన్పించింది.

అంతలో మాస్టారే–

"మీరు బస్సులూ, బ్యాంకులూ, ఆఫీసులూ ధ్వంసంజేస్తే, అవతలివాళ్లు స్థూపాలు ధ్వంసం చేస్తున్నారు" అన్నారు.

ఆశ్చర్యపోయేడు చినప్పుల్రాఁవుడు. తను యే స్థూపం గురించి మాట్లాడాలనుకున్నాడో. ఆ విషయాన్నే, మాస్టారు మాట్లాడినందుకు.

గ్రామంలో సీతారాఁవుడి స్మారక స్థూపనిర్మాణం వొక కీలకదశలో జరిగింది. అజయ్‌బాబు కోలనీ సాధించేక, మిల్లు పేల్చిన కారణంతో అమలయిన నిర్బంధంతో జనాన్ని మళ్లీ శివన్నారాయణ ఆకర్షించేడు. ఈసారి కేసుల యెత్తివేత ఊసెత్తలేదు. సబ్సిడీ పథకాలు అందించలేదు. రాజ్యహింస భయాన్ని జనాల్లోకి యెక్కించేవాడు శ్రేయోభిలాషిలా! అటు, రాజకీయ ప్రత్యర్థులైన లక్ష్మునాయుడి కొడుకుల్ని రాజకీయాల నుంచి కాంట్రాక్ట్ రంగానికి తరలించేడు. పంచాయితీ నిధుల్తో నిర్మాణమైన 'బస్సు షెల్టర్'కు "కీర్తిశేషులు జాగాన లక్ష్మునాయుడు జ్ఞాపకార్థం" అని నామకరణంజేసి, ఆవిష్కరణ సభ జరిపేడు. ఇలా, గ్రామ పెత్తందార్ల సయోధ్య దశలో మళ్లీ పేదల్ని సంఘీకృతం జేసింది "సీతారాఁవుడు స్మారక స్థూపం". అప్పుడు, మాస్టారే స్థూపనిర్మాణ పనులన్నీ నిర్వహించారు. చివరికి, పోలీసులు, నిర్మాణాన్ని పూర్తి చెయ్యడానికీ, ఆవిష్కరణకీ అడ్డుదగిల్తే – శివన్నారాయణను కిడ్నాప్‌చేసి, కార్యక్రమాన్ని జయప్రదం జేసింది. తమ దళం...!

కాసేపు మౌనం తర్వాత.

"శ్రీరాములునాయుడ్ని కలిసేను. స్థూపాన్ని తిరిగి నిర్మించాలని చెప్పేను" చెప్పేడు చినప్ప్రాంవుడు.

"అతనికా శక్తి వుందా?"

"అతనూ అదే మాటన్నాడు".

మఠం విప్పి, కాళ్లుచాపి, తలగడ మీద చేయి ఆన్చి చేరబడ్తూ, మాస్టారు చినప్ప్రాంవుడివేపు చూస్తూ –

"బోలెడు మార్పులొచ్చేయి. కొన్ని మార్పులు శ్రీరాములునాయుడు కాలంలో వొచ్చేయి. ఆ తర్వాత మరికొన్ని...! ఇటీవల మరింత వేగంగా వొచ్చేయి మార్పులు. సంపదా, దరిద్రమూ రెండూ పెరిగేయి ఊరిలో! రెంటిమధ్యా అంతరమూ పెరిగిపోయింది...." చెప్పేక, ఆగేరు. ఇంకా, యేవేవో లోపలి ఆలోచనల్ని తర్కించుకుంటున్నారు.

చినప్ప్రాంవుడు మాస్టారిని అర్థం చేసుకుంటూ–

"కమ్యూనిటీ డెవలప్మెంట్, కోపరేటివ్ సెక్టార్, బ్యాంకింగ్ పరపతీ వగైరాలు– తొలినాళ్లలో భూస్వామ్య, ధనికవర్గాలకే ఉపయోగపడ్డాయి. ఆ తర్వాత అధిక ఉత్పత్తి, సస్యవిప్లవం– ఎరువులూ, మందుల కంపెనీలకు ఉపయోగపడింది. ఆ కంపెనీలకు బహుళజాతి సంస్థలూ జోడు కలిసేయి. ఇటీవల నూతన ఆర్థిక విధానాలు కార్పొరేట్ రంగానికి గ్రామీణ వ్యవసాయాన్ని అర్పణజేయటానికి దోవవేస్తున్నాయి" అని సంక్షిప్తంగా మార్పుల సారాన్ని చెప్పేడు!

గానీ మాస్టారు విన్నట్లుగాలేదు. తన ఆలోచనల్లోంచే–

"మీ తాత, అలనాడు శ్రీరాములునాయుడు చేసిన కార్యక్రమాల్ని 'యజ్ఞం' అన్నాడు. మీ చిన్నాయన పంచాయితీ మండపాన్ని మండపంకాదది, 'రాజ్యం' అని తేల్చి చెప్పేడు.

సీతారాంవుడు జైలు నుంచి తప్పించుకొొచ్చి 'విప్లవం' అంటే నిజమనుకున్నాను. అపుడది, అణచబడినా, ఓడిపోయినా మళ్లా ఆరంభమంటే నమ్మేను. ఆ నమ్మకంతోనే అజయ్బాబూ వెళ్లుంటాడు" యెక్కడో వున్నారు మాస్టారు.

"కాదా? ఇది విప్లవం కాదా?" ఆశ్చర్యమూ, అసహనమూ కలగలిసిన స్వరంతో ప్రశ్న. మాస్టారు, యీ ప్రశ్నను విన్పించుకోలేదు. ఎక్కడ తన సంభాషణను ఆపారో, అక్కడ్నించే కొనసాగించేరు.

గది కిటికీల రెక్కలు కొట్టకోసాగేయి. గాలి సాగినట్టుంది. చినప్ప్రావుడే లేచి కిటికీ రెక్కలు మూసేడు. మాస్టారు, దీర్ఘంగా యింటిపైకప్పువేపోసారి చూసి, మళ్లీ తన కాళ్లవేపోసారి చూసి, కాళ్లు కూడేసి కూర్చొని–

"అప్పల్రాఁవుడు తన యెరుకకు అందినకాడకి తన జీవితాన్ని వెనకా ముందూ తడుముకున్నాడు. తమ బతుకుల్లోకీ, ఊరిలోకీ ప్రవేశించే వొక్కో విశేషమూ మంచికే అన్నట్టుగా కన్పించి; కొసకి యెలా తమకి చెడు చేసాయో చెప్పేడు. సీతారాఁవుడేమో కడుపు కోసుకొని చూపేడు.

లోతుగా ఆలోచిస్తే, అక్కడికొక విషయం బోధపడతాది. అప్పటిదాకా ప్రజలందరి ఆమోదంతోటి, పెద్దల రూపంలో పంచాయితీ మండపం రాజ్యం పాత్రని నిర్వహించేదని! అప్పటికి పెద్దలకి ఆ శక్తీ, అధికారమూ వుండేయి. ఆ రోజుతో... సరి! పెద్దల స్థానంలోకి రాజ్యం వొచ్చేసింది. తొలిసారిగా, ఆ గ్రామస్థుడ్ని పోలీస్‌స్టేషన్‌కీ, కోర్టుకీ లాక్కెళ్లింది. చివరికి.... అతగాడ్ని చంపింది కదా....?" అని ప్రశ్నించేరు మాస్టారు. జవాబుకోసం ఆగకుండానే మళ్లీ–

"ఆ తర్వాత? ఏఁవైంది? యుద్ధం! లక్ష్మునాయుడ్ని చంపేరు. యుద్ధం.... గెలుపూ, వోటమీ .... యుద్ధం... యుద్ధం...!

సీతారాఁవుడు పెద్దల్ని యెదరించలేక కన్న కొడుకుని చంపుకున్నాడు. ఎందుకూ...? అప్పటికి రాజ్యం తన పాత్రని గ్రామ పెద్దలకిచ్చింది. ఆ తర్వాత పోలీసులూ, కోర్టుల రూపంలో రాజ్యం పాత్ర పెరిగింది. ఆర్థికంగా భూస్వాముల పాత్ర విస్తరించింది. పెత్తందార్ల స్థానంలోకి రాజ్యం ప్రవేశించింది.

ఇదిగిదీ... అసలు విషయం. దేనితో యుద్ధం? ఎవరితో యుద్ధం...? యుద్ధానికి వొక ముగింపు కనిపిస్తుందా? వున్నదా...? ఎన్నాళ్లు...యీ యుద్ధం? ఎందుకు...?" లోలోపలి ప్రశ్నల్నీ, విశ్లేషణలనీ...వొక్క బిగువున విన్పించి కళ్లు మూసుకున్నా మాస్టారు.

చినప్పల్రాఁవుడికి అంతకుముందు తల్లి వేసిన రెండు ప్రశ్నలూ గుర్తొచ్చేయి, ఇద్దరి ప్రశ్నల సారాంశం... వొక్కటే! గానీ, సమాధానం తల్లికి చెప్పినట్లుగా భావోద్వేగంతో చెప్పలేకపోతున్నాడు. మనసులో యెన్నో కదుల్తున్నాయి. పంచాయితీ మండపమ్మీద తెగిపడిన బాలుని శిరస్సూ, భూమికోసం ఘర్షణలో క్షతగాత్రులూ, యెన్నెన్ని గాయాలకో మరణించిన తాతయ్యా, నెత్తురు చిందించిన చిన్నాయినా, వెంటాడిన పోలీసులూ, సాగించిన పోరాటాలూ, సహచరుల అమరత్వం, కూలిన స్థూపం....

"యుద్ధం గురించి తీర్పు చెప్పాలంటే, యుద్ధం తమ అనుభవంలోకి రావాలి..." ఆలోచనల్లోంచి బదులిచ్చేడు చినప్పల్రాఁవుడు.

మాస్టారి మనసు చివుక్కుమంది. మూసిన కళ్లు తెరిచేరు. తలగడ ప్రక్కన పడేసి, కాళ్లు కూడేసి కూర్చొని–

"బాబూ! వొక్కమాట గుర్తుంచుకో! నేను యుద్ధాన్ని శంకించటంలేదు. అలాగ్గానీ

శంకిస్తే, నా కన్నకొడుకుని శంకించినట్టే గదా!" అని ఆగేరు. గొంతులో జీర. చినప్పల్రాంవుడికీ బాధ కలిగింది. అలాంటి జవాబు యిచ్చి వుండాల్సిందికాదు అనసుకున్నాడు. ఆ తర్వాత, మాస్టారే గొంతు సవరించుకొని–

"నా వయసయి పోయింది. మృత్యువుకి దగ్గరలో వున్నాను. ఈ మధ్య తరచుగా మీరే గుర్తుకొస్తున్నారు. మీతో కొన్ని చెప్పాలని గుండెలో కొట్లాట. చెప్పకుండా వెళిపోతానేమో నన్నభయం!" క్షణంసేపు కళ్లు మూసేరు. చినప్పల్రాంవుడి హృదయం బాధగా మూల్గింది.

"నాకు యీ ఊరే ప్రపంచం. దీనితోటే ప్రపంచాన్ని బోధపర్చుకుంటాను. మీ తాత అప్పల్రాంవుడికీ అంతే. నాకు బోధపడిన భోగట్టాలు నీ ముందుంచుతాను. వాట్ని పరిశీలించుకో. అక్కడ్నించి ఆరంభిస్తాను..." అని, వొక సుదీర్ఘ చరిత్రను బోధించే ఉపాధ్యాయునిలా చరిత్రలో లీనమయ్యేరు మాస్టారు.

"అప్పల్రాంవుడు, పురోణీకాగితమ్మీద వేలిముద్ర వేసే ముందు మాట్లాడేడు చూడూ, గుర్తు తెచ్చుకో! అప్పటికి నువ్వు హైస్కూల్ విద్యార్థివనుకుంటాను. అక్కడి నుండే ఆరంభిస్తాను.

అప్పటికి పదిహేనేళ్లుగా ఊరిలోకొచ్చిన మార్పుల్తో సూర్యెంబాబు రైస్‌మిల్లూ, బట్టల వ్యాపారంలోకి దిగి వేల రూపాయిల టర్నోవర్నీ లక్షలలలోకి పెంచుకున్నాడు. గ్రామాభివృద్ధికి యిచ్చిన విరాళానికి యెన్నో రెట్లు లబ్ధిపొందేడు. అక్కున్నాయుడు స్కూలు కోసమూ, ఆఫీసుల కోసమూ భూమిదానమిచ్చేడు. వాటి వలన యిళ్ల స్థలాలకు విలువ పెరిగి ఆయన లబ్ధిపొందేడు. సావుకారి గోపన్నగూడా రానిబాకీలు వసూలు చేయించుకొని, వ్యాపారాన్ని నిలబెట్టుకున్నాడు. మరికొందరు మరికొన్ని విధాల బాగుపడ్డారు. రైస్‌మిల్లొచ్చి పనులుపోయిన దంపుడు కూలీలు, రోడ్లు వలన వొచ్చిన లారీల్తో బళ్ల అద్దెలు పోయినవాళ్లూ, వ్యవసాయంలోకి వ్యాపారమొచ్చి దెబ్బతిన్న రైతులూ, కులవృత్తులు పోయినవాళ్లూ ఆనాటికి యజ్ఞానికి సమిధలు! శ్రేయోరాజ్యమనుకున్నారు. 'ముందుకే వెళ్తోంది ప్రగతి రథం' అన్నారు. చివరికి కమ్యూనిజం తమ రాజకీయ లక్ష్యమనుకున్న వారు గూడా గ్రహించలేకపోయేరు. ఆ రోజుల్లో మేమూ యువజనసంఘాల ద్వారా యజ్ఞానికి సహకరించేం. నువ్వు ఆ రోజులకి వెళ్ళి ఆలోచించు..." అని ఆగేరు. లేచి, దగ్గరలోని బిందెలో నీళ్లు గ్లాసులో నింపుకు తాగేరు. చినప్పల్రాంవుడికి 'నీళ్లుగావాలా' అనడిగేరు. ఆ తర్వాత మళ్లీ యధా ప్రకారమే కూర్చొని–

"....చివరికేంమైంది? కూలీలు, చిన్నరైతులు, కులవృత్తులవాళ్లూ సమిధల్లా...? వీళ్లే సీతారాంవుడికి సైన్యమయినారు. యుద్ధంజేసారు. ప్రోనోటు పత్రాలు కాల్చేసారు. భూముల్ని స్వాధీనం చేసుకున్నారు. బ్రతుకు నిండుగా నిలబడినారు. నువ్వెంతంటే నువ్వెంతన్నారు! నీదొక వర్గం. మాదొకవర్గం అన్నారు! వర్గపోరాటమన్నారు. వర్గశత్రు సంహారమన్నారుగానీ, కూడేసుకోవలసిన వాళ్లనందర్నీ కూడేసుకోకుండానే తొందరపడినారు. అదొక దశ!

కేసులూ, కోర్టులూ, జైల్లూ, కాల్పులూ సీతారాంవుడి మరణం! ఆ తర్వాత భయకంపితమైంది గ్రామం. కేసులు యెత్తివేస్తామంటే, భూములు వొదులుకోడానికి సిద్ధపడిన పేదలు, పథకాలేవో అంటే దరఖాస్తు దారిపట్టడం! శివన్నారాయణ నాయకుడు గావటం. మరికొన్ని మార్పులు. మీ నడిపినాయన సర్పంచ్‌గావటం, మీ హరిజనకాలనీ "అంబేద్కర్ నగర్" గావటం; గ్రామంలో రైతులూ, కులవృత్తులవారేగాక; వొక ఉద్యోగతరగతి, పోలీసు కానిస్టేబుళ్లూ, బంట్రోతులూ... కొందరు... తయారవటం. గ్రామ పెద్దలలో స్థానచలనాలు గావటం. వ్యవసాయ, వ్యాపారరంగాలకోసం గ్రామీణ అభివృద్ధికోసం రాజ్యం యెక్కువగా, గతంకంటే నిధులకేటాయింపు చేయటం జరిగేయి. ఇదొక దశ! ఈ దశలో శ్రీరాములు నాయుడు అంతర్ముఖుడై పోయేడు. కొత్తగా యెదిగిన సంపన్నుల్లాగాక, సాంప్రదాయ సంపన్నుడిలా ప్రవర్తించిన, లక్ష్మునాయుడి కొడుకు- శివన్నారాయణ ముందు ఓడిపోయేడు. సూర్యెంబాబు కొడుకులు ట్రేడింగు నుండి ఇండస్ట్రీలోకి యెదిగేరు. మునసబు పిల్లలు పట్నంలో యేవో 'ఎంటర్‌ప్రైజ్' బిజినెస్‌లో బలపడ్డారు. గోపన్న సావుకారి పట్నంచేరిపోయి 'ఫైనాన్స్ కంపెనీ' పెట్టేడు. ఇలా కొందరెత్తిరిపోయేరు. నిధులు పొడుగుచేతుల వాళ్లందుకున్నారు. రాజ్యం తాను నిర్వహిస్తున్న ఆర్థిక, సంక్షేమ కార్యకలాపాలన్నింటినీ పైవారికి అప్పగించి వేస్తున్నది. ఫలితంగా వారి కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి.

ఈ రెండో దశకి అటూ యిటుగా మీరొచ్చేరు. కోలనీ కోసం కదిలించేరు. మిల్లుల్ని పేల్చారు. శివన్నారాయణని బంధించేరు. స్థూపాన్ని నిర్మించేరు. గానీ, మీ మధ్యలోంచే మూడోదశ నడిచింది. నడుస్తోంది. అది ఆగలే. పరమక్రూరంగా వుంది బాబూ, యీ దశ! ట్రాక్టర్లు, ఎరువులు, మందులు, యంత్రాలు, యెన్నడెరగని వ్యాపారపంటలు, ఫైనాన్స్ కంపెనీలు, సారా వ్యాపారాలు, జూదాలు, కాన్వెంటులు, కంపెనీలు... కొసకి మీ వాడలోని జానేసూ, అసిరయ్యా...మూడు వంట బట్టీలూ- ఆరు బార్‌షాపుల్లా వెలుగుతున్నారు....

బాబూ వొక్క విషయం! వొకప్పుడేమో గానీ, అవతలివారి సామ్రాజ్యం యిపుడు చెక్కుచెదరటంలేదు. మీరు ఊరిలో మిల్లు కూల్చితే, సూర్యెంబాబు పిల్లలు పట్నంలో ఫ్యాక్టరీ పెట్టుకోగలిగేరు. కిడ్నాప్ జరిగాకనే శివన్నారాయణ మండలస్థాయి నుండి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగేడు.

అంతకుముందో... యెలా ఎదిగేరు? కోపరేటివ్ సొసైటీ చేజిక్కించుకొని శివన్నారాయణ ఎదిగేడు. బ్యాంక్ సబ్సిడీల్తో, ఋణపరపతుల్తో వ్యాపారాన్ని పరిశ్రమలలోకి మార్చి సూర్యెంబాబు కొడుకు మల్లిబాబు యెదిగేడు. కొత్తవిత్తనాలూ, ఎరువులూ, యంత్రాలతోటి అధికదిగుబడులు దించి లక్ష్నునాయుడు కొడుకు, ఆ మిగులుని పట్నంలో

హోటల్స్, సినిమా హాల్స్ వ్యాపారాల్లోకి పెట్టి ఎదిగేడు. మునసబు కొడుకులు రోడ్లూ, బిల్డింగులూ కాంట్రాక్టులుజేసి, లక్షలు సంపాదించి ఎంటర్‌ప్రైజ్ వ్యాపారాలకెదిగేరు.

వాళ్ల సామ్రాజ్యం చెక్కుచెదరదు బాబూ మీరేం జేసినా! గానీ, యిటో అలాలేదు. సీతారాఁవుడి మరణంతో అల్లకల్లోలం. చాన్నాళ్లు స్తబ్దత! రేపు... మీరు... మీ తర్వాత....?"

మాస్టారు, మరి మాట్లాడలేకపోయేరు. కళ్లు మూసుకొని లోలోపలి ఉద్వేగాన్ని అదుపుజెయ్యగలననుకుని ప్రయత్నిస్తున్నారు.

చినప్పల్రాఁవుడు మాస్టారి సంభాషణని అర్థంజేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. మాస్టారి లోపలి ఉద్వేగానికి ఊరటగా–

"...వొక సీతారాఁవుడితోటీ, వొక చినప్పల్రాఁవుడితోటీ విజయపతాక యెగురేసెయ్యగలమని యెలా అనుకుంటున్నారు మాస్టారూ?" అనన్నాడు.

మాస్టారు, మూసిన కళ్లు తెరచి చినప్పల్రాఁవుడ్ని వోసారి కళ్లారా చూసి నిట్టూర్చేరు. ఆ తర్వాత కాసేపు మరచిపోయినదేనినో గుర్తుకు తెచ్చుకునేట్టుగా దీర్ఘంగా, లోలోపల తర్కించుకొని–

"ఆఁ! మర్చిపోయేను. మరొక్కమాట. మూడోదశ వొచ్చిందన్నానా? ఈ దశలో అంతా తలకిందులయిపోయింది బాబూ! రాజ్యం, తాను నిర్వహిస్తున్న ఆర్థిక, సంక్షేమ కార్యకలాపాలన్నింటినీ పైవారికి అప్పగించి వేస్తున్నది. ఫలితంగా వారి కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. బాగా పరిశీలించు.

"శ్రీరాములునాయుడ్ని ఉదాహరణకోసం 'రాజ్యం' అనుకో! అప్పుడు విద్యాలయం నెలకొల్పితే యిపుడు దాన్ని నడవలేక కమిటీలకి అప్పజెప్పటమైంది. విద్యా కమిటీలున్నాయిగానీ విద్యలేదు. అందరి సభ్యుల సహకారంకోసం యేర్పరచిన అప్పటి సహకార పరపతి సంఘాలు యిపుడు దివాళా తీస్సేయి. చిట్స్, ఫైనాన్స్ కంపెనీలొచ్చేయి! విద్య, వైద్యం యేదీ...యే సేవా అందించలేని స్థితిలో రాజ్యముంది. వొకవైపు నాణెమిది. నాణేనికి మరోవైపు... చూడు! ఊరిలో ప్రజలేమైనారు? మన గ్రామానికి మెట్టభూములూ, చెరువుల దిగువ పల్లపుభూములూ, వర్షాధార పల్లపు భూములూ–మూడు రకాల వ్యవసాయ భూములున్నాయి. మెట్టభూములు హరిజన్లకీ, కూలీనాలీలకీ వుండేవి. వర్షాధార భూములు మధ్యతరగతి రైతులకి; చెరువుదిగువ పల్లాలు పెద్ద రైతులకి వుండేవి. ఇప్పుడవి యేమైనాయో, యెలా చేతులు మారినాయో.... విను, చెప్తాను.

చెరువు దిగువ పల్లపు భూముల్లో పంటకు గ్యారంటీ వుండేది. వాటి మీద కొత్త విత్తనాల్తో అధిక దిగుబడి దీసే పెద్దరైతులు వ్యవసాయంలోకి ట్రాక్టర్లూ, వాటర్ ఇంజన్‌లూ, మోటార్లూ దించేరు. కూలీల మీద ఆధారపడటం తగ్గించేసారు. పంటల్లో మిగులునూ

గ్రామాల్లో వుంచలేదు. పట్నం వ్యాపారాలకి పట్టుకుపోయేరు. వీళ్లే యిపుడు. పట్నాల్లోనా, ఊరిలోనా రాజకీయాల్నీ, వ్యాపారాల్నీ నడిపేది.

ఇక వర్షాధార పల్లపుభూములున్న మధ్య తరగతి రైతుల పరిస్థితి ఋతువుల్తో జూదం! వర్షాలు పాలించి, పంటలు పండితే వారి యింట్లిపాదికీ కడుపులు నిండేవి. ఎండితే వ్యవసాయంలోకి వొచ్చిన ట్రాక్టర్లకీ, మోటారింజన్లకీ, ఎరువులూ, పురుగుల మందులకీ అవసరమయి జేసిన అప్పులు తడిసి మోపెడై భూముల్ని తరగేసేసాయి.

నీకు గుర్తుందా...? అలనాడు, మీ భూమిని కొనడానికి మొలగుడ్డలో బయానా పట్టుకు తిరిగిన, మండపం మీద పురోణీ రాయించుకున్న ముసలయ్య....! అతనిపుడు కొడుకుల్తోపాటూ, విజయవాడలో ముఠా కళాసీగా బతుకుతున్నాడు. ఋతువులూ, మార్కెటూ మధ్యతరగతి రైతుని పూర్తిగా దివాలాదీస్సాయి. వీటికితోడు జీవన వ్యయమూ పెరిగింది. కరెంటు ఖర్చూ, కాన్వెంట్ల ఖర్చూ, వైద్యఖర్చూ మరికొన్ని పనికిమాలిన ఖర్చులూ–ఎంత పెరిగింది జీవనవ్యయం!

ఇక మెట్టభూమల కూలీనాలీ, మాలలస్థితీ? ఒకప్పుడా భూములకోసరం యుద్ధంజేసారు. ఇపుడవే భూములు శిరోభారమైనాయి. వాటిమీద మదుపులు కిట్టుబాటు గావటంలేదు. పూర్వంలాగా యింకోవైపు కూలి దొరకటంలేదు. యంత్రాలాక్రమింపచేసినాయి గదా పొలంపన్లను. సగంకి మించి మెట్టభూంవుల అమ్మకమైపోయింది. ఎవరో, అటెటునుంచో రాజులు వొచ్చేరు. మెట్టభూంవులు లాటున కొనేసారు. పండ్లతోటలు, జీడితోటలు, కొబ్బరి తోటలు...వేసారా రాజులు. అమ్ముకున్నోళ్లంతా వలసబోయేరు, ఎవర్లేరు ఊరిల. మిగిలి నోళ్లు ఫైనాన్స్ కంపెనీలకోసం మూటలుమోసీ, రిక్షాలు తొక్కీ, యేవో కోత, మోతలాంటి యంత్రాలాక్రమించని పొలంపన్లు కూలిజేసి బతుకీడుస్తంద్రు. ఈ కుటుంబాల స్త్రీలకే స్వయంశక్తి సంఘాలని...దీపమని...దుమ్ము విసిరి కొట్లాడుకునేస్థితి కల్పించింది, రాజ్యం... మీరింతక మునుపేడాది...తోటలు ఖాళీజేసి వెళిపొమ్మనీ, యెవర్నీ భూములు కొనొద్దనీ పోస్టర్లేసారు. గానీ యేమయ్యింది?" ఆగేరు మాస్టారు.

చినప్పల్రాంవుడికి అదంతా కదలాడింది. ఆ ఏడాదికంటే ముందే గ్రామస్థితి మీద చర్చించుకున్నాక పెట్టుబడుల్తో వొచ్చే యితర ప్రాంతం వార్ని నిరోధించాలనీ, రాబోయే కార్పొరేట్‌రంగ ప్రవేశనిరోధానికి గ్రామాన్ని సిద్ధంజెయ్యాలనీ కార్యక్రమం నిర్ణయించుకుని తోటలు ఖాళీజేయించే కార్యక్రమం తీసుకున్నారు.

"తోటల యజమాన్లు భయపడ్డారు. కొందరు తొందరగానే ఖాళీజేసారు. కొందరు పోలీసుబలగాన్ని తెచ్చుకొని నిలబడ్డారు. ఇంకోవైపు, ప్రజల్లోగూడా చీలిక తెచ్చేరు".

"ఎటూ, అవి మాకు గొడ్డుమోతు గోవులయినాయి, బతుకువెళ్లకంటన్నాయి. అందికే, అమ్మినాం. పనికిరాని మెట్టలేగానీ పల్లపు భూములరేట్లిచ్చి కొంతన్నారు...."

"ఇపుడు మనం వొద్దంతే మనకే నస్టం. ఆళకేటి సొమ్మున్న మారాజులు. మరొక్కాడ కొనుకుంతారు... అంతేగదేటి? కూడుజల్లితే....కాకులు కరువేటి...? పల్లపు భూంవులరైతులూ దివాలాల్దీసీసినారు... మనమొక లెక్కా, డొక్కా....ఏదో చచ్చినోడి పెళ్లికి వొచ్చిందే కట్నం..."

ప్రజలు, వొకిరికి తెలీకుండా వొకరు....డబ్బు అందుకొని, ఊరొదిలి వెళిపోయేరు. ఆ సందర్భంగానే, రాజులు కొనిన తోటలను కొన్నిట్ని ధ్వంసంజేసి, మోటార్ పంప్‌లు కాల్చివేయటం, తోటలు ఖాళీజెయ్యండని పోస్టర్లు వేయటం. ఆ సందర్భంగానే జరిగిన పొరబాటు వలన బాంబులు పేలిపోయి తమ దళసభ్యులిద్దరు చనిపోయేరు. మరో కామ్రేడ్‌కి చేయి తెగిపోతే మాస్టారింటిలో వొదిలేసి...వెళిపోవటం జరిగింది.

మాస్టారు మళ్లీ సరిగ్గా అక్కడందుకున్నారు-

"నీకు తెలుసు. నరుకోత బెట్టేరు మమ్మల్ని. గాయపడిన అతడిని కాపాడలేక పోయేం. అదే అదనని సీతారంవుడి స్థూపాన్ని కూల్చినారు. కట్టినచేతుల చేతనే... కూలగొట్టించినారు. కూలిపోయింది....కూలిపోయింది.

బతుకులు కూలిపోయినయి. స్థూపం కూలటం సమస్యగా యెవురికుంది నాయినా....? తప్పువాళ్లదిగాదు కూలిన బతుకులో...? కూల్చిందెవరు? రాజ్యమా? శివన్నారాయణా, సూర్యెంబాబు కొడుకు మల్లిబాబా? ఫైనాన్స్, చిట్స్ కంపెనీలా? తోటల రాజులా? జానేషా, ఆశీర్వాదమా? మీ నడిపినాయినలా...? ఎవరు శత్రువులు? ఎవరు మిత్రులు? ఎవరితో యుద్ధం...?" అని వొక్క ఊపిరిలో ప్రశ్నించి, ఆగేరు.

చాలాసేపు మాస్టారు మాట్లాడలేదు. చినప్పల్రాంవుడుగూడా మౌనంగా ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి మాస్టారే –

"అలనాడు అప్పల్రాంవుడు, ఆ తర్వాత ముసలయ్య, యిపుడింకో రైతు- రేపు పెద్దరైతులు అయిదారుగురు తప్ప మిగిలిన అందరూ భూమికి దూరమయిపోతారు. మిల్లులూ, కంపెనీలూ యెలాగూ మూతబడిపోతన్నాయి. మరో దేశానివొస్తన్నాయి. గ్రామాలకీ అంతే! కాదంటావా? ఇదేగదాకన్పించబోయే దృశ్యం...." అని దీర్ఘంగా నిట్టూర్చేరు.

చినప్పల్రాంవుడేమీ బదులు చెప్పలేదు.

ఆకాశంలో మెరుపు మెరిసింది. పెద్దగా ఉరుము ఉరిమింది. మళ్లీ చినుకులారంభించేయి.

చాలా సేపటిదాకా...యిద్దరూ యేమీ మాట్లాడలేదు. తర్వాత, మాస్టారే-

"....అదిగో, ఆ మంచం వాల్చుకో. ఆ స్టూలు మీది బొంతా, దిండూ తీసివేసుకో..." అని చెప్పి ఆవలింత తీసేరు.

అంటే...? అక్కడితో యిక సంభాషణ ఆపేస్తున్నట్టా...? ప్రశ్నార్థకంగా చూసేడు చినప్పల్రాంవుడు.

* * *

అకస్మాతుగా మాస్టారికి మెలుకువ వచ్చింది. బయట అదే పనిగా కుక్కలు అరుస్తున్నాయి. మాష్టారు చెవులొగ్గి విన్నారు. ఈ సారి తన ఇంటి వీధి గుమ్మం వైపు, పెరటి వేపు కుక్కలు అరుపులు. వీధి చివరి నుంచి కోళ్ళు కొక్కురోకో అంటున్నాయి. ఆందోళనగా లేచారు మాష్టారు. అప్పటికే పెరటి వేపు నుంచి వీధి వాకిట నుంచి, పోలీసుల ప్రవేశం. బూట్ల శబ్దాలు, బూతు కూతలు.

మాస్టారి గుండెల్లో ముళ్ళ కంప ఏదో కథలాడినట్లయింది, గాభరాగా ప్రక్క మంచం వేపు చూసారు మంచం ఎత్తివేసి ఉంది. పరచుకున్న గుడ్డలు స్టూలు మీద పెట్టేసి వున్నాయి. ఆ మంచం వేసినట్లు గాని, ఆ పరుపు గుడ్డలు పరిచినట్టు గాని ఆనవాళ్ళు ఏమి లేవు. గుండెలు నెమ్మదించాయి.

కిటికీ లోంచి సూర్యకిరణం మాస్టారి మొహం మీద పడింది.

పోలీసులు టార్చ్ లైట్లు ఆపేసి ఇంట్లోంచి బయటకి నడిచేరు. ★

*'ప్రజాసాహితి', సెప్టెంబర్ 2001*